

- దశావతార సన్నిధిలో స్వీకరించిన జనసేనాని
- తిరుమల లడ్డూ తయారీలో కల్తీ దుర్మార్గమైన చర్య
- హిందువుల మనోభావాలను దెబ్బతీసిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టమని హెచ్చరిక

పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష

పెదకాకాని, సెప్టెంబరు 22: కలియుగ ప్రత్యక్షదైవం వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ఘోర అపచారం జరిగింది. అమృతతుల్యంగా.. పరమ పవిత్రంగా భావించే తిరుమల లడ్డూ ప్రసాదం అపవిత్రమైంది. సనాతన ధర్మాన్ని నమ్మే ప్రతి ఒక్కరూ ఇందుకు ప్రాయశ్చిత్తం చేసుకోవాల్సిందే.. అంటూ జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదివారం 'ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. 11 రోజులు కొనసాగే ఈ దీక్షను ఆయన గుంటూరు సమీపంలోని నాగార్జున వర్సిటీ ఎదుట నంబూరు పరిధిలోని దశావతార వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వీకరించారు. దీక్ష అనంతరం తిరుమల శ్రీవారిని జనసేనాని దర్శించుకోనున్నారు. దీక్ష చేపట్టేందుకు వచ్చిన పవన్‌కల్యాణ్‌కు ఆలయ నిర్వాహకులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లకు పవన్ కల్యాణ్ పట్టువస్త్రాలు సమర్పించారు. తొలుత ఆలయంలో విఘ్నేశ్వరుడికి పూజ చేశారు. వేద పండితులు ప్రత్యేక పూజల అనంతరం మహాలక్ష్మి అమ్మవారిని దర్శించు కున్నారు. తిరుమల లడ్డూ ప్రసాదం అపవిత్రమైన నేపథ్యంలో క్షమించమని వేంకటేశ్వరస్వామిని కోరుతూ ఆయన దీక్ష మాలధారణ తీసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్రీవారి మహాప్రసాదమైన లడ్డూను కల్తీ చేయడం దుర్మార్గమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి హిందువు, ధర్మాన్ని పాటించే ప్రతీ వ్యక్తి దీన్ని ఖండించి పోరాడాలన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ సంస్కరణల పేరుతో స్వామివారి పూజా విధానాలను కూడా మార్చేసిందన్నారు. రామ తీర్థం ఆలయంలో రాముడి విగ్రహానికి శిరచ్ఛేదం చేస్తే ఆ ఘటనపై పోరాటానికి చిలకలూరిపేట నుంచి ముస్లింలు వచ్చి మద్దతు ఇచ్చారని తెలిపారు. తమది కక్ష సాధింపు ప్రభుత్వం కాదని అలాగని ఎవరైనా తప్పులు చేస్తే ఉపేక్షించే ప్రభుత్వం కూడా కాదన్నారు. తిరుమలలో జరిగిన ఘటన ఇంకెక్కడా భవిష్యత్తులో జరగకుండా చూసేలా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. తిరుమలలో స్వామివారి ప్రసాదంలో కల్తీ జరుగుతుంటే అధికారులు, బోర్డు సభ్యులు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టమని హెచ్చరించారు. ఈ అపరాధంతో సంబంధం లేక పోయినా తాను ప్రాయశ్చిత్త దీక్ష తీసు కున్నట్లు చెప్పారు.



దశావతార సన్నిధిలో దీక్ష తీసుకుంటున్న పవన్‌కల్యాణ్

అభిమానోత్సాహం..

పవన్‌రాకతో ఆలయ ప్రాంగణం అభిమానులతో నిండి పోయింది. పెద్ద సంఖ్యలో అభిమానులు అక్కడికి చేరుకుని పవన్‌కల్యాణ్‌కు నీరజనాలు పలికారు. ఆలయంలో ప్రవేశించేటప్పుడు పవన్‌కల్యాణ్‌పై పూలవర్షం కురిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు లింగమనేని రమేష్, లింగమనేని పూర్ణ భాస్కరరావు దంపతులు, శాసనమండలి సభ్యులు హరిప్రసాద్, పొన్నూరు నియోజకవర్గ జనసేన నాయకురాలు పార్వతి నాయుడు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



ఎన్‌వోసీ రద్దు.. ఆగని నిర్మాణాలు

- గ్రీన్‌గ్రేస్‌పై ఏడాది క్రితమే రైల్వే నిర్ణయం
- చర్యలపై జీఎంసీకి రైల్వే సీనియర్ డీఈఎన్ లేఖ
- నోటీసులతో సరిపెట్టిన అప్పటి కమిషనర్ కీర్తి
- నాటి వైసీపీ నేతల ఆదేశాలతో తదుపరి చర్యలకు వెనకడుగు

గుంటూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర నడిబొడ్డున స్వామి థియేటర్‌కు సమీపంలో నిర్మిస్తున్న గ్రీన్‌గ్రేస్ అపార్టుమెంట్ ఆకాశ హర్మ్యాలకు రైల్వే శాఖ ఎన్‌వోసీని గత ఏడాదే రద్దు చేసింది. జీ+4 భవనాలకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకుని ఆ తర్వాత జీ+15 నిర్మాణాలు చేపట్టడంతో రైల్వే శాఖ అధికారులు క్షేత్రపరిశీలన చేసి అనుమతులను ఉల్లంఘించినట్లు నిర్ధారించారు. రైల్వే సరిహద్దు నుంచి కేవలం 24.38 మీటర్ల దూరంలోనే నిర్మాణాలు జరుగుతుండటంతో సెట్ బ్యాక్ నిబంధనలు ఉల్లంఘించినట్లు తేల్చారు. రైల్వే సీనియర్ డీఈఎన్ (కో-ఆర్డినేషన్) జేవీ అనూష నేతృత్వంలో అధికారులు పరిశీలించి ఎన్‌వోసీ రద్దు చేసినట్లుగా అప్పటి నగరపాలకసంస్థ కమిషనర్ కీర్తి చేకూరికి సమాచారం ఇచ్చారు. దీని ఆధారంగా గ్రీన్‌గ్రేస్ అపార్టుమెంట్స్ నిర్మాణాలు నిలిపేయాలని కమిషనర్ స్టాప్ ఆర్డర్ జారీ చేసినట్లు అధికారవర్గాలు తెలిపాయి. అయితే అప్పటి వైసీపీ నేతల ఒత్తిళ్లతో అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో నిన్నమొన్నటి వరకు నిర్మాణాలు నిరాటంకంగా కొనసాగుతూ వచ్చాయి. ఆదిత్య ఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్ సంస్థ 2015లో జూట్‌మిల్లు స్థలంలో జీ+4 అపార్టుమెంట్ భవన నిర్మాణానికి రైల్వే శాఖకు ఎన్‌వోసీ కోసం దరఖాస్తు చేయగా అప్పటి దక్షిణ మధ్య రైల్వే హెడ్‌క్వార్టర్స్ సీజీఈ పరిశీలించి అనుమతి ఇచ్చారు. ఎన్‌వోసీ ఆధారంగా కరెస్పాండింగ్ డ్రాయింగ్స్‌ని జారీ చేశారు. అయితే 2023లో రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ /పీవే/ గుంటూరు రైల్వే సీనియర్ డీఈఎన్ (కో-ఆర్డినేషన్) దృష్టికి జీ+4కు అనుమతి తీసుకుని జీ+15 నిర్మిస్తున్న విషయాన్ని తీసుకెళ్లారు. పేరు కూడా భజరంగ్ అర్బన్ ప్రైవేటు లిమిటెడ్‌గా మార్చు చేశారని నివేదించారు. దీనికి రైల్వే నుంచి ఎలాంటి ఎన్‌వోసీ తీసుకోలేదన్నారు. కాగా సెట్‌బ్యాక్‌కు అవసరమైన స్థలాన్ని విడిచి పెట్టడంలో ఉల్లంఘనలు ఉన్నాయని తెలిపారు. మెయిన్ బిల్డింగ్ ప్రస్తుత ఎత్తు 13 మీటర్లుగా ఉందని, ఇది అనుమతి తీసుకున్న జీ+4కి చాలా ఎక్కువని చెప్పారు. అంతేకాకుండా సెల్లార్ నిర్మాణం రైల్వే హద్దుకు సమీపంలో చాలా ప్రమాదకరంగా ఉందన్నారు. ఈ ఉల్లంఘనలన్నింటిని పరిగణనలోకి తీసుకున్న రైల్వే సీనియర్ డీఈఎన్ ఎన్‌వోసీ నిబంధనలు ఉల్లంఘించినందున గతంలో ఇచ్చిన అనుమతి రద్దు అయినట్లే భావించాల్సిందిగా గుంటూరు నగరపాలకసంస్థ కమిషనర్‌ను అడ్రస్ చేస్తూ లేఖ పంపారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు తక్షణమే తగిన చర్యలు చేపట్టాలన్నారు. భజరంగ్ అర్బన్ ఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు కూడా నిర్మాణాలు నిలిపేయాలన్నారు.

అన్ని వేళ్లు కార్పొరేషన్ వైపే

రైల్వే శాఖ ఎన్‌వోసీని రద్దు చేస్తూ ఏకంగా అప్పటి కమిషనర్ కీర్తి చేకూరికి లేఖ రాశారు. ఆమె సాధారణ అపార్టుమెంట్ల ప్లాన్ల విషయంలో స్వయంగా తానే పరిశీలించి అన్నింటిని చూసి సవ్యంగా ఉంటేనే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేసేవారు. అలాంటిది గ్రీన్‌గ్రేస్ అపార్టుమెంట్ల వైపు ఎందుకు కన్నెత్తి అయినా చూడలేదో అర్థం కాని పరిస్థితి. గ్రీన్‌గ్రేస్ అపార్టుమెంట్లు నిర్మిస్తున్నది అప్పటి మంత్రి అంబటి రాంబాబు సోదరుడు మురళీకృష్ణ కావడమే ఏకైక కారణంగా కనిపిస్తున్నది. కేవలం స్టాప్ ఆర్డర్‌తో చేతులు దులుపుకున్నారు. అప్పటి నగర పాలకసంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులు, గ్రీన్‌గ్రేస్ అపార్టుమెంట్స్ నిర్మాణదారులతో చేతులు కలిపినట్లు పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆరోపిస్తున్నారు. అసలు ఇప్పటివరకు రైల్వే శాఖ జారీ చేసిన ఎన్‌వోసీ రద్దు, కార్పొరేషన్ ఇచ్చిన స్టాప్ ఆర్డర్స్‌ని ఎందుకు బహిర్గతం చేయలేదని ఆయన ప్రశ్నించారు. స్టాప్‌వర్క్ ఆర్డర్స్ ఉన్నా భజరంగ్ అర్బన్ ఇన్‌ఫ్రా సంస్థ పనులు కొనసాగించడం వల్ల పక్కనే ఉన్న చిన్నచిన్న భవనాలు పునాదులు దెబ్బతిన్నాయన్నారు. అవి ఏ క్షణాన నేలకొరుగుతాయోనన్న భయాందోళన యజమానుల్లో నెలకొన్నదని చెప్పారు. రైల్వే శాఖ పంపిన ఎన్‌వోసీ రద్దు ఆదేశాల లేఖని కార్పొరేషన్‌లో మాయం చేసినట్లు తమకు అనుమానం కలుగుతుందన్నారు. దీనికి సంబంధించి బాధ్యులపై చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

బదిలీల జాతర

- జడ్పీ సీఈవోగా జ్యోతిబసు
- జిల్లా అటవీశాఖాధికారిగా హిమశైలజ
- డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా విజయలక్ష్మి
- మైనింగ్ జిల్లా అధికారిగా శ్రీవెంకటసాయి
- ఉమ్మడి గుంటూరులో 57 మంది ఎంపీడీవోల బదిలీ

గుంటూరు సిటీ, బాపట్ల(ఆంధ్రజ్యోతి), సెప్టెంబరు 22: బదిలీల నేపథ్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌లో ప్రక్షాళన జరిగింది. జడ్పీ కార్యాలయంతోపాటు, 57 మండలాల్లో ఎక్కువ మంది సిబ్బందికి స్థాన చలనం కలుగుతుంది. జడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా, ఇన్‌చార్జి సీఈవో మోహన్‌రావు బదిలీ లపై చేపట్టిన కసరత్తు ఆదివారం అర్ధరాత్రికి కొలిక్కి వచ్చి నట్లు సమాచారం. ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలను పరిగ ణనలోకి తీసుకుంటూనే, నిబంధనలను అమలు చేయాలన్న ఆలోచనతో బదిలీల జాబితాను రూపొందిస్తున్నట్లు తెలి సింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 57 మండలాల్లో ఎంపీడీవోలకు స్థానచలనం జరగనుంది. ప్రస్తుతం 43 మం ది ఎంపీడీవోలు ఉండగా వారిలో 8 మంది పక్క జిల్లాలకు వెళ్లేందుకు దరఖాస్తు చేసుకున్నారు.



బదిలీల జాబితాపై ఆదివారం రాత్రి కసరత్తు చేస్తున్న ఇన్‌చార్జి సీఈవో మోహన్‌రావు

ఉమ్మడి జిల్లా పరిధిలో బదిలీకి 30 మంది దరఖాస్తు చేసుకోగా ఐదుగురు దర ఖాస్తు చేసుకోలేదు. దరఖాస్తు చేసుకున్న వారి బదిలీలు లాంఛనమే అని సమాచారం. 16 మంది ఎంపీడీవోలు ఉమ్మడి గుంటూరు జిల్లాకు కొత్తగా రాగా వారికి మండలాల కేటాయింపుపై కసరత్తు చేపట్టారు. పల్నాడు జిల్లాకు చెందిన కొందరు ఎమ్మెల్యేలు ఆదివారం సాయంత్రం కూడా ఎంపీడీవోల బదిలీలపై జడ్పీ అధికారులకు ఫోన్లు చేస్తూనే ఉన్నారు. ఎమ్మెల్యేల సిఫార్సు చేయడంతో తదనుగుణంగా జాబితాను రూపొందించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇన్‌చార్జి సీఈవో మోహన్‌రావు జిల్లాలో కొనసాగేందుకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఆయనకు స్థానచలనం కలగనుంది. డ్వామా పీడీ పోస్టు కోసం దరఖాస్తు చేసినా ప్రభుత్వం తీసుకున్న పాలసీ వల్ల ఆయన జిల్లా దాటి వెళ్లాల్సి వస్తుంది.


జఠిలంగా బదిలీల ప్రక్రియ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి సారి జరుగుతున్న బదిలీలు కావడంతో కార్యాలయ అధికారులు, సిబ్బంది బదిలీలు జడ్పీలో జఠిలంగా మారాయి. జడ్పీ కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది మార్పునకు సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం కీలక స్థానాల్లో ఉన్న వారిలో చాలా మంది వైసీపీ హయాంలో వచ్చిన వారే. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఎమ్మెల్యేలు జడ్పీలోని 9 మంది ఏవోల బదిలీపై సూచనలు చేసినట్లు తెలుస్తోంది. వారి స్థానంలో కొత్త వారి పేర్లను ప్రతిపాదించి సిఫార్సు లేఖలు జడ్పీకి పంపినట్లు సమాచారం. ఆరుగురు సీనియర్ అసిస్టెంట్లు, 11 మంది జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు టైపిస్టుల బదిలీపై రాజకీయ ఒత్తిడి ఉన్నట్లు సమాచారం. వైసీపీ హయాంలో ఓ సామాజికవర్గం లక్ష్యంగా బదిలీలు జరిగాయన్న విమర్శలు వచ్చాయి. అప్పుడు అన్యాయం జరిగిన వారికి ఇప్పుడు ప్రాధాన్యం కల్పించే దిశగా అడుగులు పడుతున్నట్లు సమాచారం.

అధికారుల బదిలీలు ఇలా..

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో పలువురు అధికారులు బదిలీ అయ్యారు. బదిలీ అయిన వారిలో కీలక విభాగాలకు చెందిన అధికారులు ఉన్నారు. జడ్పీ సీఈవోగా వీ జ్యోతిబసు, డిప్యూటీ సీఈవోగా సీహెచ్ కృష్ణ నియమితులయ్యారు. ఇక జడ్పీ ఇన్‌చార్జి సీఈవో మోహన్‌రావుని నెల్లూరుకు బదిలీ చేశారు. జిల్లా అటవీశాఖ అధికారి కే మహబూబ్‌బాషా బదిలీ కాగా ఆ స్థానంలో ఎం హిమశైలజను నియమించారు. చాలాకాలంగా గుంటూరు గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీగా పనిచేస్తున్న వై హరిహరనాథ్‌ను మాతృ శాఖ అయిన పంచాయతీరాజ్‌కి బదిలీ చేయగా, ఆ స్థానంలో డ్వామాలో డీఎల్డీవోగా పనిచేస్తున్న టీవీ విజయలక్ష్మిని నియమించారు. జిల్లా పంచాయతీ అధికారి కే శ్రీదేవి నెల్లూరు జిల్లా కందుకూరుకు బదిలీ కాగా ఆ స్థానంలో నాగసాయి రానున్నారు. తెనాలి డీ ఎల్డీవో కే పద్మావతిని చీరాలకు బదిలీ చేసి ఆ స్థానం లో కందుకూరు డీఎల్డీవో పీ పద్మజను నయమించారు. బాపట్ల డీఎల్డీవోగా జీవీ నారాయణరెడ్డిని, రేపల్లె డీఎల్డీవోగా పీ పద్మ నియమితులయ్యారు. బాపట్ల డ్వామా, డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీగా ఉన్న వై పిచ్చిరెడ్డిని గుంటూరు డీఎల్డీవోగా నియమించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జడ్ రమేష్ తెనాలి నుంచి విజయవాడకు, జీ అశోక్ పర్చూరు క్వాలిటీ కంట్రోల్‌కు, జే హరేరామకృష్ణ ఒంగోలు నుంచి బాపట్లకు, జీ ముత్యంబాబు బాపట్ల నుంచి తెనాలికి బదిలీ అయ్యారు. బాపట్ల డీపీవో రవికుమార్‌ను కాకినాడు జిల్లాకు బదిలీ చేసి ఆ స్థానంలో కేఎల్ ప్రభాకర్‌రావును నియమిస్తూ ప్రభు త్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏలూరు జిల్లా డ్వామా విజిలెన్స్ విభాగం జిల్లా అధికారిగా విధులు నిర్వహిస్తున్న విజయలక్ష్మిని బాపట్ల జిల్లా డ్వామా పీడీగా నియమితులయ్యారు. గుంటూరు జిల్లా మైన్స్ అండ్ జియాలజీ అధికారి ఎస్‌కేవీ సత్య నారాయణని చిత్తూరుకు బదిలీ చేసి ఏపీ ఎండీసీలో విధులు నిర్వహిస్తున్న ధూళిపాళ్ల శ్రీవెంకటసాయిని ప్రభుత్వం ఇక్కడ నియమించింది.





వైసీపీకి జీ హుజూర్.. మళ్లీ పోస్టింగ్

ఐదేళ్లు ప్రకాశం జిల్లా ఇన్‌చార్జి డీపీవోగా ఉన్నతాధికారుల ఆదేశాలను కూడా లెక్క చేయకుండా వైసీపీ నేతల సేవలో తరించిన నారాయణరెడ్డికి తాజా బదిలీల్లో బాపట్ల డీఎల్‌డీవోగా పోస్టింగ్ దక్కింది. డీపీవోగా ఆయన పై అధికారుల అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ నేతలు చెప్పినట్లుగా అప్పట్లో బదిలీలు చేపట్టారనే ఆరోపణలు కూడా ఆయనపై ఉన్నాయి. అద్దంకి, చీరాల, పర్చూరు పరిధిలో చేపట్టిన బదిలీ లపై అప్పట్లో బాపట్ల జేసీ శ్రీనివాసులు నారాయణరె డ్డికి షోకాజ్ నోటీసులు కూడా జారీచేశారు. ఆ తర్వాత ఆయన సెలవుపై వెళ్లారు. కాగాప్రకాశం డీపీవోగా జీవీ నారాయణరెడ్డి పనిచేసిన కాలంలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని తాజాగా కలెక్టర్ వెంకట మురళికి చినగంజాం మండలానికి చెందిన కూటమి నేతలు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ప్రస్తుత బదిలీల్లో ఆయనకు బాపట్ల డీఎల్డీవోగా పోస్టింగ్ ఇవ్వడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వైసీపీతో అంటకాగినా.. అందలమే

- దేవదాయశాఖలో కొనసాగుతున్న వివాదాస్పద అధికారులు
- కూటమి ప్రభుత్వంలోనూ వారికి అదే స్థానాలపై వెల్లువెత్తుతున్న విమర్శలు

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 22: గత వైసీపీ ప్రభుత్వంలో గుంటూరు జిల్లా దేవాదాయ శాఖలో కొందరు అధికారులు బరితెగించారు. నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వహించడమే కాకుండా అక్ర మాలతో చెలరేగిపోయారు. అంతేగాకుండా అప్పటి ప్రతిపక్షం టీడీపీ అధినేత చంద్రబాబును నేరుగా విమర్శించడంతో పాటు సభలను కూడా అడ్డుకు న్నారు. ఇలాంటి అధికారులపై కూటమి ప్రభు త్వంలో చర్యలు ఉంటాయని అందరూ అనుకున్నారు. కానీ వారు అదే స్థానాల్లో కొనసాగు తుం డటంపై దేవదాయ శాఖ లోని మిగిలిన అధికా రులు, ఉద్యోగు లు మండిపడుతు న్నారు. వైసీపీ ప్రభు త్వంలో ఆ పార్టీ నేత లతో ఐదేళ్లు అంట కాగి ఇప్పుడు కూడా వారి హవానే కొనసాగడంపై విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. వైసీపీ ప్రభుత్వానికి అప్పట్లో అనుకూలంగా పని చేయడమే కాకుండా అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడిన వారు ఇంకా అదే స్థానాల్లో కొనసాగడంపై విమర్శ లు వస్తున్నాయి.



- మంగళగిరిలో ఓ ఈవో అప్పటి వైసీపీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డితో చేతులు కలిపి పెద్ద కోనేరు తవ్వకాల్లో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆయనకు ఈవోగా కొనసాగే అర్హత లేనప్పటికీ తొలుత ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు చేపట్టారు. 2019లో గెలుపొందిన వైసీపీ ఎమ్మెల్యేలు ఇళ్లకు వెళ్లి మంగళగిరి నరసింహస్వామి ప్రసాదాన్ని అందజేసి ఎమ్మెల్యేలను ఆ అధికారి సత్కరించారు.
- జూనియర్ అధికారిగా ఉన్న ఓ అధికారిని వైసీపీ ప్రభు త్వం గుంటూరు దేవదాయశాఖలో కీలక పోస్టింగ్‌లో నియమించింది. ఇన్‌చార్జిగా కాకుండా రెగ్యులర్ పోస్టింగ్ చేస్తూ జగన్ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఇదే అవకాశంగా ఆ అధికారి పలు అంశాలకు సంబంధించి అడ్డగోలుగా ఉత్తర్వులు జారీతో పాటు నిబంధనలకు విరుద్ధంగా జీతాలు డ్రా చేశారన్న ఆరోపణలున్నాయి.
- గతంలో గుంటూరు ఏసీగా, ఇప్పుడు కీలక స్థానంలో ఉన్న ఓ అధికారి ఉద్యోగులను డబ్బుల కోసం వేధించడమే కాకుండా, గత ప్రభుత్వానికి అనుకూలం గా ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారని సమాచారం. వడ్లమూడి సంగంలో డీవీసీ ఆస్పత్రికి చెందిన కో ఆపరేటివ్ స్థలాన్ని దేవదాయశాఖ ఆస్తి కింద రిజిస్ట్రేషన్ జరిపించిన ఘటనపై అప్పట్లో సంగం డెయిరీ ఛైర్మన్ నరేంద్రకుమార్ హైకోర్టు ను ఆశ్రయించి స్టే తీసుకొచ్చారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో చంద్రబాబు బహిరంగ సభలకు దేవదా యశాఖ స్థలాలు ఇవ్వనివ్వకుండా ఆ అధికారి అడ్డుకున్నారు. పర్చూరులో జరిగిన చంద్రబాబు సభను అడ్డుకుని రైతులకు నోటీసులు ఇచ్చి వారిని భయభ్రాంతులకు గురిచేసిన సంఘటన అప్పట్లో వివాదాస్పదమైంది.
- గత ఏడాది సెప్టెంబరు 9న చంద్రబాబు అరెస్టు అయినప్పుడు గుంటూరులోని డీసీ కార్యాలయంలో ఓ అధికారి అనుచిత వ్యాఖ్యలు చేశారని తెలిసింది. బాబు అరెస్టు అయ్యాడు.. బాధపడే వారు రండి అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు అప్పట్లో పెద్ద దుమారం రేపాయి. ఇలాంటి అధికారులపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి. అప్పుడు వైసీపీ అండతో విర్రవీగి, ఇష్టారాజ్యంగా వ్యవహరించిన అధికారులపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోగా వారిని అదే స్థానాల్లో కొనసాగించేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై విమర్శలు వస్తున్నాయి.

ఎస్వీఎన్ కాలనీలో మరో భారీ చోరీ

- 50 సవర్లకు పైగా బంగారు ఆభరణాల అపహరణ

6లో..

పరిశుభ్రతతోనే పరిసరాల స్వచ్ఛత

- స్వచ్ఛతా హీ సేవ ర్యాలీలో కలెక్టర్ నాగలక్ష్మి
- కలెక్టర్‌తో పాటు సైకిల్ తొక్కిన ఎస్పీ, కమిషనర్

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 22: ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా స్వచ్ఛత సాధించవచ్చని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా ఆదివారం స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్ నుంచి సైకిల్ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీని తొలుత కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్‌తో పాటు ఎస్పీ ఎస్.సతీష్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు సైకిల్ తొక్కుతూ ర్యాలీలో పాల్గొన్నారు. పెద్దసంఖ్యలో ఉద్యోగులు, విద్యార్థులు ఉత్సాహంగా సైకిల్ ర్యాలీ చేశారు. పరేడ్ గ్రౌండ్ నుంచి శంకర్ విలాస్ సెంటర్, గుజ్జనగుండ్ల, పట్టాభిపురం మీదగా తిరిగి పరేడ్ గ్రౌండ్ వరకు ఈ ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో జీఎంసీ డీసీలు సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకటకృష్ణయ్య, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ శ్యాంసుందర్, ఎంహెచ్‌వోలు మధుసూదన్, రామారావు, రాంబాబు, ఆనందకుమార్, ట్రాఫిక్ డీఎస్పీ రమేష్, సీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్ నవీన్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



సైకిల్ తొక్కుతున్న కలెక్టర్, కమిషనర్, ఎస్పీ తదితరులు

సూర్యలంక హత్య కేసులో నిందితుడి అరెస్టు


నిందితుడిని మీడియా ముందు ప్రవేశపెట్టి కేసు వివరాలు వెల్లడిస్తున్న బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు

బాపట్ల రూరల్, సెప్టెంబరు 22: సూర్యలంక హత్య కేసులో నిందితుడిని బాపట్ల రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిని మీడియా ముందు ప్రవేశ పెట్టి కేసు వివరాలను బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు వెల్లడించారు. బాపట్ల పట్టణం హనుమంతరావుకాలనీ గత కొన్నేళ్లుగా నివాసం ఉంటున్న బి.ఏసుబాబు (45) ఫైనాన్స్‌కు డబ్బులు ఇస్తూ జీవనాన్ని కొనసాగించేవాడు. ఈనెల 16వ తేదీన అతని వద్ద పని చేసే కొక్కిలిగడ్డ చంద్రశేఖర్ డబ్బులు వసూల్ చేయటానికి మృతుడు ఏసుబాబును పిలవగా తన ద్విచక్రవాహనంపై ఆదర్శనగర్ వద్ద చంద్రశేఖర్‌ను ఎక్కించుకొని సూర్యలంక వెళ్తుండగా, మార్గమధ్యలో నిందితుడు చంద్రశేఖర్ ద్విచక్ర వాహనాన్ని చప్టా వద్ద ఆపమన్నాడు. డబ్బులు విషయంలో చంద్రశేఖర్ మృతుడు ఏసుబాబుతో గొడవ పడి తన వెంట తెచ్చుకున్న కోడికత్తితో ఏసుబాబు మెడపై, శరీర భాగాల్లో పొడిచాడు. ఏసుబాబు అతని నుంచి తప్పించుకొని తన బండిపై సూర్యలంక గ్రామానికి చేరుకుని దోమ వెంకట్రావుకు చెందిన కిరణా షాపు వద్ద పడిపోయాడు. ఫైనాన్స్ డబ్బుల విషయంలో గొడవపడి తనని కొక్కిలిగడ్డ చంద్రశేఖర్ కత్తితో పొడిచినట్లు గోవర్ధన్ అనే వ్యక్తికి చెప్పి చనిపోయాడు. ఈ విషయంపై మృతుడి భార్య అములు ఫిర్యాదు మేరకు బాపట్ల రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 22న సూర్యలంక రోడ్డులోని పందెంకోడి రెస్టారెంట్ సమీపంలో రూరల్ సీఐ కె.గంగాధర్ సిబ్బందితో కలిసి నిందితుడిని అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు వేగవంతంగా నిర్వహించిన అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, డీఎస్పీ రామాంజనేయులు, రూరల్ సీఐ కె.గంగాధర్, పోలీసులను ఎస్పీ అభినందించారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య


శివగంగరాజు (ఫైల్ ఫొటో)

గురజాలటౌన్, సెప్టెంబరు 22: అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పులిపాడులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కన్నెబోయిన శివగంగరాజు (30) రెండేళ్లుగా ఏడు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి, మిర్చి సాగు చేశాడు. పంటల దిగుబడి సరిగా రాకపోవడంతో రూ.7 లక్షల దాకా అప్పులయ్యాయి. అప్పులు ఎలా తీర్చాలో అర్థంకాక మనస్తాపంతో శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


మృతుడు మేఘావత్ బాబులు నాయక్

బొల్లాపల్లి, సెప్టెంబరు 22: మండలంలోని కండ్రి గ్రామానికి చెందిన మేఘావత్ బాబులు నాయక్(55) విద్యుదాఘాతంలో ఆదివారం మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బాబులు నాయక్ తన మిర్చి పొలానికి నీరు పెట్టేందుకు విద్యుత్ మోటారు వద్దకు వెళ్లి కరెంటు తీగలు తగలటంతో విద్యుదాఘాతానికి గురై కింద పడి పోయాడు. చుట్టు పక్కల పొలాల వారు వచ్చి చూడగా అప్పటికే బాబులు నాయక్ మృతి చెందాడు. ఈ ఘటనపై బాబులు నాయక్ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎ.బాలకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాబులు నాయక్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పాముకాటుకు కూలీ మృతి

గురజాలటౌన్, సెప్టెంబరు 22: పాముకాటుకు కూలీ మృతి చెందిన సంఘటన గురజాల పట్టణంలో చోటుచేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గురజాల పట్టణానికి చెందిన సింగంపల్లి సోమయ్య (54) ఆదివారం కూలి పనుల నిమిత్తం గురజాల నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురంలో గడ్డి మూటలు ఎత్తడానికి వెళ్లాడు. గడ్డి మూటలు ఎత్తుతుండగా పాము కాటు వేసింది. తోటి కూలీలు అతడ్ని గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే సోమయ్య మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వరినారుకు భలే గిరాకీ

- దెబ్బతిన్న పొలాల్లో మళ్లీ నాటుకు రైతుల అవస్థలు


నారు తీస్తున్న కూలీలు

బాపట్ల, సెప్టెంబరు 22: అతివృష్టి, అనావృష్టి మధ్య అల్లాడుతున్న రైతుల ఆశలు చిగురించాయి. ఆగస్టు నెల చివరి నుంచి ఈ నెల మొదటి వారం వరకు కురిసిన భారీ వర్షాలతో, వరదనీటితో ముంపునకు గురైన పొలాల్లో పైరు, నారు కొంత కుళ్లిపోయింది. పంటను రక్షించుకునేందుకు నీటి మొత్తాన్ని రైతులు తొలగించారు. ఆ తర్వాత వేసవిని మించిన ఎండతీవ్రత రావటంతో పొలాల్లో ఉన్న పైరు ఎండుముఖం పట్టింది. కొంతమంది రైతులు అయితే పైరును గొర్రెల మేతకు వదిలేశారు. మరికొందరు ఇంజిన్లతో డ్రైయినేజిలో అడుగంటి ఉన్న నీటిని తోడుకొని రక్షించే ప్రయత్నం చేశారు. సముద్ర తీర ప్రాంత రైతులు ఆశలు వదులుకున్నారు.

సెంటు రూ.3 వేలు..

దీనికితోడు దెబ్బతిన్న పొలాల్లో మళ్లీ నాటు వేయటానికి గరువు మెరక భూముల్లో పెంచిన వరినారు కొని పొలంలోకి తీసుకురావాలంటే సెంటు రూ. 3 వేలు అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల సాగు వదిలేద్దామనుకున్న తరుణంలో శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం ఉదయం వరకు కురిసిన భారీవర్షంతో పొలాల్లో నీరు నిలిచింది. దీంతో నియోజకవర్గంలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల్లో చివరి భూముల్లో సైతం నీరు నిలిచి రైతు ఆశలు చిగురించాయి. కాల్వలకు కూడా గండ్లు పూడ్చి నీరు విడుదల చేయటంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. దీంతో మళ్లీ వరినారు కోసం పరుగులు తీస్తున్నారు. ధర ఎంతైనా కొనుగోలు చేస్తున్నారు.

అడ్వాన్స్ ఇచ్చి మరీ..

బాపట్ల మండలంలోని ధరివాద కొత్తపాలెం, కర్లపాలెం మండలంలోని నల్లమోతువారిపాలెం, నందాయపాలెం, ఎం.వి.రాజుపాలెం పరిసర ప్రాంతాల్లో ఒక దఫా నారు విక్రయించిన వారు మళ్లీ వెంటనే నారు పోశారు. 10 రోజుల క్రితం పోసిన నారు మరో 10 రోజుల్లో తీసుకెళ్తామని చెప్పి సెంటు రూ.1800 నుంచి రూ.2500 వరకు మాట్లాడుకుని అడ్వాన్స్ ఇచ్చి వెళ్తున్నారు. దీంతో మెరక భూముల్లో నారు పెంచే సన్న, చిన్నకారు రైతులకు లాభదాయకంగా మారింది. విత్తన రకాలను బట్టి నారు ధర పైపైకి వెళ్తుందని రైతులు పేర్కొంటున్నారు. బాపట్ల పరిసర ప్రాంతాల నుంచే కాకుండా పల్నాడు, గుంటూరు జిల్లాల నుంచి కూడా నారు కొనుగోలు చేసేందుకు రైతులు ఈ ప్రాంతానికి వస్తున్నారు.


నారు కొనుగోలు చేసి ట్రాక్టర్‌లో తెచ్చి దించుకుంటున్న రైతులు

దేవునికే ద్రోహం చేసిన జగన్‌కి ప్రజలు ఓ లెక్కా


చావలి గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, సెప్టెంబరు 22: తిరుమల వేంకటేశ్వరస్వామికి ద్రోహం చేసిన జగన్మోహన్‌రెడ్డికి ప్రజలు ఒక లెక్క అని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆదివారం చావలి కల్యాణ మండపంలో గ్రామ సర్పంచి, జనసేన నాయకులు విష్ణుమొలకల శ్రీనివాసరావు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. వాలేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే తొలుత పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను గోడలపై ఆయన స్వయంగా అంటించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన తిరుపతి లడ్డూ ప్రసాదంలో, ఇతర ప్రసాదాలలో జంతు కొవ్వుతో తయారు చేసిన నూనె వాడి పవిత్రతను దెబ్బతీసిన జగన్ రెడ్డికి వెంకటేశ్వర స్వామి గుణపాఠం చెప్పారన్నారు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని ప్రజలను నయవంచన చేసిన జగన్ వ్యవస్థలను భ్రష్టు పట్టించారన్నారు. 100 రోజుల పాలన కాలంలో 100 సంక్షేమ పథకాలు అమలుకు శ్రీకారం చుట్టి విజన్ 2047తో ముందుకు సాగుతున్నామని చెప్పారు. ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లులాంటివన్నారు. దీపావళి పండగ నుంచి పేదలకు ఏడాదికి మూడు సిలిండర్లు అందిస్తామన్నారు. డ్వాక్రా మహిళలకు అందించే రుణాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామన్నారు. పంచాయతీల నిధులు రూ.12 వేల కోట్లు జగన్ దారి మళ్లిస్తే ఈ రోజు పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఉన్న పవన్ కల్యాణ్ రూ.12,500 కోట్లు నిధులు నేరుగా పంచాయతీల ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు. భూ హక్కు చట్టాన్ని రద్దు చేయడం ద్వారా రైతుల భూములకు రక్షణ కల్పించినట్లు చెప్పారు. జగన్ రూ.60 వేల కోట్లకు పైగా ఇసుక దోపిడీ చేశారని, ఈ రోజు ఉచితంగా ఇసుకను సరఫరా చేస్తున్నట్లు వివరించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పాలన చంద్రబాబు నేతృత్వంలో పవన్ సహకారంతో ముందుకు నడుస్తుందన్నారు.

క్రీడలు నాయకత్వాన్ని పెంపొందిస్తాయి

- శాప్ మాజీ చైర్మన్ అంకమ్మ చౌదరి
- ఏపీ స్టేట్ పికిల్ బాల్ పోటీలు ప్రారంభం


క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అంకమ్మ చౌదరి, నిర్వాహకులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 22: క్రీడలు ఆరోగ్యంతోపాటు, నాయకత్వాన్ని పెంపొందిస్తాయని ఏపీ శాప్ మాజీ చైర్మన్ డాక్టర్ పి.అంకమ్మ చౌదరి అన్నారు. ఏపీ పికెల్ బాల్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక గుంటూరు, హనుమయ్య నగర్‌లో, వీవీవీ హెల్త్ హబ్‌లో ఆదివారం ఏపీ పికిల్ బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం అంకమ్మ చౌదరి మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో పికిల్ బాల్ క్రీడ బాగా ప్రాచుర్యం పొందిందని, మన దేశంలో కూడా ఇప్పుడు బాగా ప్రాచుర్యం చెందుతుందని తెలిపారు. ఏపీ పికిల్ బాల్ సంఘం కార్యదర్శి ఎన్.శ్రీధర్ మాట్లాడుతూ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలకు చెందిన క్రీడాకారులు హాజరైయ్యారని అన్నారు. అండర్-14, ఓపెన్, 35 ప్లస్, 50 ప్లస్ పురుషులు, మహిళల విభాగంలో సింగిల్స్, డబుల్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ఈ కోర్టులు నిర్మాణం చేపట్టాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వీవీవీ హెల్త్ హబ్ డైరెక్టర్ టి. అరుణ్ కుమార్, అమ్మయ్య, టెన్నిస్ కోచ్ జీవీఎస్ ప్రసాదు, ఆనంద్ కుమార్, నాగరాజు, సుష్మ, స్వప్న, భరత్, వలి తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన తెలంగాణ ఎడ్లు


విజేతలకు బహుమతులను అందజేస్తున్న తాడికొండ ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్ కుమార్

ప్రత్తిపాడు, సెప్టెంబరు 22: జాతీయ స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు ప్రత్తిపాడులో రసవత్తరంగా సాగుతున్నాయి. గత వారం రోజులుగా వివిధ విభాగాలలో పోటీలు జరిగాయి. ఆదివారం జూనియర్స్ విభాగంలో నిర్వహించిన పోటీలలో పది జతలు పాల్గొన్నాయి. ఇందులో హైదరాబాదుకు చెందిన డి.రోహన్ బాబు ఎద్దుల జత 2523.3 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం, బురుజుపల్లి గ్రామానికి చెందిన యరమల మోక్ష అదరన్ రెడ్డి, గుంటూరుకు చెందిన సోమిశెట్టి ఆంజనేయులుల ఎద్దుల జత 2481.4 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానంలో నిలిచింది. హైదరాబాదుకు చెందిన రోహన్‌బాబు ఎద్దుల జత 2408.1 అడుగుల దూరం లాగి మూడో స్థానంలో, బాపట్ల జిల్లా చుండూరు మండలం, వేటపాలెంకు చెందిన అత్తోట శిరీష, శివకృష్ణ చౌదరిలకు చెందిన ఎద్దుల జత 2408.1 అడుగుల దూరం లాగి మూడో స్థానంలో నిలిచాయి. వీరి మరో జత 2400 అడుగుల దూరం లాగి నాలుగో స్థానంలో, కృష్ణా జిల్లా చల్లపల్లి మండలం నాదెళ్లవారిపాలెం గ్రామానికి చెందిన కాకర్ల సురేష్ బాబు ఎద్దుల 2100 అడుగుల దూరం లాగి ఐదో స్థానంలో, పెదనందిపాడు మండలం నాగులపాడుకు చెందిన ఆళ్ల మోహనరావు, గొల్లపూడి కోటయ్య చౌదరిలకు చెందిన ఎద్దుల జత 1894.6 అడుగుల దూరం లాగి ఆరో స్థానంలో, పల్నాడు జిల్లా రెంటచింతల మండలం, రెంటాలకు చెందిన పిన్నెబోయిన సూర్య అషివిక్ యాదవ్‌కు చెందిన ఎద్దుల 1506.6 అడుగుల దూరం లాగి 7వ స్థానంలో నిలిచింది. గెలిచిన అభ్యర్థులకు తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో దేశం నాయకులు గింజుపల్లి వెంకటేశ్వరరావు, శివరామప్రసాద్, కుర్రి సుబ్బారెడ్డి, భాగ్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీఎన్ కాలనీలో మరో భారీ చోరీ

- 50 సవర్లకుపైగా బంగారు ఆభరణాలు అపహరణ


చోరీ జరిగిన తీరును పరిశీలిస్తున్న పట్టాభిపురం సీఐ వీరేంద్రబాబు

గుంటూరు, సెప్టెంబరు 22: ఎస్వీఎన్ కాలనీ వాసులు వాసులు ఉలిక్కిపడ్డారు. పట్టపగలు తాళం వేసిన ఇంటిలో భారీ చోరీకి పాల్పడిన కొద్దిగంటల వ్యవధిలోనే అదే ప్రాంతంలో మరో భారీ చోరీ జరగడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. వృద్ధ దంపతులు ఇంటిలో నిద్రిస్తుండగానే దొంగలు బీరువాలోని 50 సవర్లకుపైగా బంగారు ఆభరణాలు అపహరించుకుపోవడం స్థానికులను కలవరానికి గురిచేసింది. మహాలక్ష్మి బార్ పక్క సందులో నుంచి ఎస్వీఎన్ కాలనీవైపు వస్తుండగా ఎడమ వైపున ఉన్న ఎస్వీఎన్ కాలనీలోని బాంబే డయింగ్ కాలనీలో శనివారం అర్ధరాత్రి ఈ చోరీ జరిగింది. బాధితులు, పట్టాభిపురం పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బాధితుడు సూర్యనారాయణ తపాలా శాఖలో పని చేసి ఉద్యోగ విరమణ చేశారు. వారి పిల్లలు అమెరికాలో స్థిరపడగా సూర్యనారాయణ దంపతులు ఇరువురు స్థానికంగా నివాసం ఉంటున్నారు. శనివారం రాత్రి రోజు మాదిరిగానే సూర్యనారాయణ దంపతులు హాలులో నిద్రించారు. తెల్లవారిన తర్వాత చూడగా బీరువా తెరిచి అందులో ఉన్న 50 సవర్లకు పైగా బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు గుర్తించారు. శనివారం అర్ధరాత్రి సమయంలో దొంగలు బెడ్ రూమ్ కిటికీ బోల్టులు తీసి లోనికి ప్రవేశించారు. అందుబాటులో ఉన్న తాళం చెవులతో బీరువా తెరిచి అందులో ఉన్న సుమారు 50 సవర్లకు పైగా బంగారు ఆభరణాలను అపహరించుకుపోయారు. బాధితుడు సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు పట్టాభిపురం సీఐ వీరేంద్రబాబు, ఎస్ఐ మధు పవన్, సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. సీసీఎస్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

గంటల వ్యవధిలోనే ఒకే ప్రాంతంలో..

స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్వీఎన్ కాలనీలో ఒకే ప్రాంతంలో కొద్ది గంటల వ్యవధిలోనే రెండు భారీ చోరీలు జరగడం పట్ల స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఎస్వీఎన్ కాలనీ ఏడో లైనులో శనివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల మధ్య తాళం వేసి ఉన్న ఇంటిలో భారీ చోరీ జరిగిన విషయం విదితమే. ఎస్వీఎన్ కాలనీ వాసుల్లో వరుసగా కొద్ది గంటల వ్యవధిలో రెండు దొంగతనాలు జరగడంతో వారిని ఆందోళనకు గురిచేసింది. రెండు ఘటనల్లోనూ బాధితులు దొంగల చేతికి తాళాలు ఇచ్చినట్లయింది. దగ్గరలో ఉన్న సీసీ కెమెరాలో పరిశీలించినా ఎటువంటి ఆనవాళ్లు కనిపించలేదు.

ఆదిత్య ఇన్‌ఫ్రా ఎన్వోసిని రద్దు చేసిన రైల్వే శాఖ

- ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 22: గతంలో గుంటూరు పట్టణంలో ఆదిత్య ఇన్‌ఫ్రా అపార్టుమెంట్ పేరుతో ఇచ్చిన ఎన్వోసిని రైల్వే శాఖ రద్దు చేసిందని పొన్నూరు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆదివారం తెలిపారు. రైల్వే శాఖ రద్దు చేసిన ఎన్వోసిని గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్ నిర్మాణానికి వినియోగించుకుంటున్నారని ఆరోపించారు. నిబంధనలను ఉల్లంఘించటం వల్లనే రైల్వే శాఖ ఎన్వోసిని రద్దు చేసిందన్నారు. కానీ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. రైల్వే శాఖ రద్దు చేసిన ఎన్వోసి విషయాన్ని గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు తెలియజేసింది వాస్తవం కాదా అన్ని ప్రశ్నించారు. 2023 మే 25న క్యాన్సిలేషన్ కాపీని రైల్వే శాఖ కార్పొరేషన్‌కు పంపితే ఆ నాటి నుంచి నిర్మాణాలను నిలుపుదల చేయకుండా ఎందుకు కొనసాగిస్తున్నారని కార్పొరేషన్ అధికారులను నిలదీశారు. ఎన్వోసి రద్దు ఉత్తర్వులను కార్పొరేషన్ అధికారులు దాచి పెట్టడానికి గల కారణాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. నిబంధనలు ఉల్లంఘనతో జులైలోనే స్టాప్ వర్క్ ఆర్డర్లు ఇచ్చినప్పటికీ ఎందుకు బహిర్గత పర్చలేదని ప్రశ్నించారు. స్టాప్ వర్క్ ఆర్డర్లు ఉన్నా బజరంగ్ అర్బన్ ఇన్‌ఫ్రా పనులు చేపట్టడం వల్లనే పక్కనే ఉన్న నిర్మాణాలు దెబ్బతిన్నాయని ఆరోపించారు. బజరంగ్ అర్బన్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ వారితో కుమ్మక్కైన అధికారులపై కూడా విచారణలు జరపాలని డిమాండ్ చేశారు. 35 ఏళ్ల అనుభవం ఉందని చెబుతున్న అంబటి మురళి చట్టబద్ధంగా ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్మాణాలు ఎలా కొనసాగించారని ప్రశ్నించారు. ఆదిత్య ఇన్‌ఫ్రా కంపెనీ, బజరంగ్ ఇన్‌ఫ్రా రెండు సంస్థల అనుమతుల్లో తేడాలు లేవా అన్ని ప్రశ్నించారు. తప్పుడు ధ్రువ పత్రాలు దాఖలు చేసి అనుమతులను అక్రమంగా బదిలీ చేసుకున్నారని ఆరోపించారు. ఇటీవల కార్పొరేషన్ అధికారులు విడుదల చేసిన గ్రౌండ్ పరిశీలన నివేదికలో కూడా రైల్వే శాఖ రద్దు చేసిన ఎన్వోసి గురించి తెలపకపోవటంలో అంతర్యం ఏంటని ప్రశ్నించారు. తక్షణమే సంబంధిత అధికారులపై కూడా విచారణ జరపాలని ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ డిమాండ్ చేశారు.

మూడు జిల్లాలకు కాంగ్రెస్ ఇంఛార్జిల నియామకం

గుంటూరు, సెప్టెంబరు 22: నూతన కమిటీల నియామకం చేపట్టిన ఏపీసీసీ తాజాగా జిల్లాలకు కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జిలను నియమించింది. ఉమ్మడి జిల్లా పరిధిలోని మూడు జిల్లాలకు కొత్త ఇంఛార్జిలను నియమిస్తూ ఏపీసీసీ అధ్యక్షులు వైఎస్ షర్మిల ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు జిల్లా కాంగ్రెస్ ఇంఛార్జిగా ఒంగోలుకు చెందిన శ్రీపతి ప్రకాశంను నియమించారు. ఆయన ఏపీసీసీ ఉపాధ్యక్షుడుగా వ్యవహరిస్తున్నారు. ఏపీసీసీ ప్రధాన కార్యదర్శులుగా వ్యవహరిస్తున్న జిల్లాకు చెందిన మదన మోహన్‌రెడ్డిని పల్నాడు జిల్లా ఇంఛార్జిగా, గడ్డం పాల్ విజయ్‌కుమార్‌ను బాపట్ల జిల్లా ఇంఛార్జిగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

26 నుంచి స్కూల్ ఫెడరేషన్ ఎంపికలు

గుంటూరు(విద్య), సెప్టెంబరు 22: ఉమ్మడి గుంటూరు జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 2024 - 25 సంవత్సరానికి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు డీఈవో పి.శైలజ, కార్యదర్శి మెల్లంపూడి రవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న సెపక్ తక్రా అండర్-14, అండర్-17 బాల బాలికల ఎంపికలు సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తారు. అదే రోజు బాల్ బ్యాడ్మింటన్ అండర్-14, అండర్-17 (బాలికలు మాత్రమే) ఎంపికలు శావల్యాపురంలో నిర్వహిస్తారని తెలిపారు. ఈ నెల 27న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నంబూరులో అండర్-14, అండర్-17 బాల బాలికల అథెటిక్స్ ఎంపికలు నిర్వహిస్తారని తెలిపారు.

జనసేనలోకి వైసీపీ నేత చందు సాంబశివరావు?


మంత్రి మనోహర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న చందు సాంబశివరావు

తెనాలి, సెప్టెంబరు 22, (ఆంధ్రజ్యోతి): వైసీపీ నుంచి మరో నేత జనసేనలోకి చేరే ప్రయత్నాల్లో ఉన్నారు. అంతరిక్ష శాస్త్రవేత్త, వైసీపీ నాయకుడు డాక్టర్ చందు సాంబశివరావు ఆ పార్టీని వీడి జనసేనలోకి చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. ఈమేరకు ఆదివారం రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్‌ను తెనాలిలో కలిశారు. ఇప్పటికే సామినేని ఉదయభాను, బాలినేని శ్రీనివాసరెడ్డి, కిలారు రోశయ్య వైసీపీని వదిలి జనసేనలోకి చేరుతున్నట్లు తేలిపోయింది. వీరితో సన్నిహితంగా ఉండే సాంబశివరావు కూడా మనోహర్‌ను కలవటంతో వైసీపీని వీడుతున్న నేతలు వరుస కట్టినట్టయింది. సాంబశివరావు చాలా కాలం టీడీపీలో పనిచేశారు. తర్వాత బీజేపీలో చేరి, మొన్నటి ఎన్నికలకు ముందు వైసీపీలో చేరారు.

సైనేడ్ నిందితులపై మరో కేసు నమోదు

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 22: ఆస్తులు, బంగారం, అప్పును ఎగ్గొట్టడానికి కూల్‌డ్రింక్స్‌లో, ఆహారంలో సైనేడ్ కలిపి వరుస హత్యలు చేయడం పట్టణంలో కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. స్థానిక యడ్లలింగయ్య కాలనీకి చెందిన వెంకటేశ్వరి అలియాస్ బుజ్జి, మునగప్ప, రజనీ, రమణమ్మలు సైనేడ్‌తో పలువురిని హత్యచేసి ఇటీవల అరెస్టై రిమాండ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. చెంచుపేటకు చెందిన వాలెంటీర్ అన్నపూర్ణ రెండేళ్ల క్రితం 2022 డిసెంబర్ 26న తన ఇంటిలో 20 గ్రాముల బంగారు గొలుసును వెంకటేశ్వరి అలియాస్ బుజ్జి దొంగిలించిందనీ, తనను కూడా సైనేడ్‌తో చంపాలని తన భోజనం బాక్స్‌లో సైనేడ్ కల్పిందని తెలిపింది. కలర్ మారిన భోజనాన్ని తినకపోవడంతో బతికిపోయానంది. వీరు చేసిన హత్యల గురించి ఇటీవల తెలుసుకోవడంతో తన గొలుసును వెంకటేశ్వరి దొంగిలించిందని, తనను చంపాలని ప్రయత్నించిందనే అనుమానంతో పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు త్రీటౌన్ ఎస్హెచ్‌వో ప్రకాశరావు తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

తెనాలి క్రైం, సెప్టెంబరు 22 : స్థానిక నాజరుపేటకు చెందిన వివాహిత జారిపడి గాయాలపాలు కావడంతో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు కొల్లిపర మండలం సిరిపురంకు చెందిన అత్తోట వసంతలక్ష్మి (33) మొదటి భర్తతో విభేదాలు రావడంతో ఏడాది క్రితం కరీమ్ పృధ్వీని రెండో వివాహం చేసుకుని నాజరుపేటలో నివాసం ఉంటున్నారు. ఈమెకు మొదటి వివాహం వలన ఇద్దరు మగ పిల్లలు, రెండో వివాహం వలన ఆగస్టు 29న మరో మగ పిల్లవాడికి జన్మనిచ్చింది. వారం రోజుల క్రితం బాత్‌రూమ్‌లో జారిపడి గాయాలవ్వడం భర్త కరీమ్ పృధ్వీ ఆమెను గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకి తరలించి చికిత్స అందిస్తున్నాడు. శనివారం ఆమె ఆరోగ్యం విషమించి మృతి చెందింది. దీనిపై మృతురాలు, కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్పృహ కోల్పోయి మరొకరు..

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 22: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణంలో చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. ఆదివారం త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మార్కెట్ సెంటర్‌లోని కొత్త వంతెనపై పనుల నిమిత్తం వెళ్తున్న వ్యక్తి స్పృహ కోల్పోయాడన్నారు. అదే సమయంలో అక్కడ విధి నిర్వహణలో ఉన్న డీఎస్పీ జనార్దనరావు, సీఐ రమేష్‌బాబు గమనించి ఆ వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆటోలో జిల్లా వైద్యశాలకు తరలించారన్నారు. చికిత్స పొందుతూ ఆ వ్యక్తి మృతి చెందాడని తెలిపారు. మృతి చెందిన వ్యక్తి పేరు విజయ కుమార్ అని అతనికి ఎవరూ లేరని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, సెప్టెంబరు 22: నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం ఆదివారం నాటికి 589.30 అడుగులు ఉంది. ఇది 309.95 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,350 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 2,926 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 28,501 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 44,177 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 46,177 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 22 : పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 33,847 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 36,963 క్యూసెక్కుల నీరు ఒక గేటు ద్వారా దిగువ కృష్ణకు విడుదల అవుతుంది. వీటిలో 16వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా దిగువకు విడుదల అవుతున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	123, 132, 142
చికెన్ విత్ స్కిన్	230.00
చికెన్ స్కిన్ లెస్	240.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

కావ్య ఆర్థో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ ప్రారంభం

గుంటూరు (మెడి కల్) సెప్టెంబరు 22: గుంటూరులో పూర్తిస్థాయిలో ఆర్థో మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలు, అత్యాధునిక వైద్య పరికరాలతో, నిష్ణాతులైన వైద్యుల సారథ్యంలో అందు బాటులోకి రావడం హర్షణీయమని సత్తెన పల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక కొత్తపేట మెయిన్ రోడ్ రిలయన్స్ డిజిటల్ పక్కన నూతనంగా నిర్మించిన కావ్య హాస్పిటల్స్‌ను ఆయన ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, బయ్యా ఈఎన్‌టీ, ఐ హాస్పిటల్ ఎండీ డాక్టర్ బయ్యా శ్రీనివాసరావు హాజరయ్యారు. కన్నా లక్ష్మీనారా యణ మాట్లాడుతూ డాక్టర్ కార్తీక్ కోట ఎంతో ప్రతిభావంతుడని, పేద, మధ్య తర గతి ప్రజలకు అందుబాటు ధరల్లో చక్కటి వైద్యసేవలు అందిస్తారని తెలిపారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేలా నగ రంలో ఆర్థో మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలు కావ్య హాస్పిటల్‌లో లభించడం అభినంద నీయమన్నారు. డాక్టర్ బయ్యా శ్రీని వాసరావు మాట్లాడుతూ కావ్య హాస్పిటల్స్‌లో 24 గంటలూ వైద్యసేవలు అందు బాటులో ఉంటాయని, ప్రజలు దీనిని వినియోగించు కోవాలని కోరారు. కార్యక్రమంలో కావ్య హాస్పిటల్స్ వైద్య బృందం ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కార్తీక్ కోట, డాక్టర్ గోపీకృష్ణ, డాక్టర్ బయ్యా సుధీర్, డాక్టర్ వీ.జ్యోతి, డాక్టర్ డీ.జ్యోత్స్న, డాక్టర్ కేవీఎం ప్రవీణ్, డాక్టర్ ఎస్.నిశాంత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న షేక్ లాల్ వజీర్, పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు

డిసెంబరు 14న మాస్టర్ అథ్లెటిక్ మీట్

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 22: మాస్టర్ అథ్లెటిక్ మీట్‌ను ఈ ఏడాది డిసెం బరు 14, 15 తేదీల్లో గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ లాల్ వజీర్ తెలిపారు. ఆదివారం ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో గెలిచిన వారు 2025 జనవరి 31న కేరళలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు
ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఎంపిక

గుంటూరు(విద్య),సెప్టెంబరు 22: ఈ నెల 14 నుంచి 19 వరకు నల్గొండలోని 'ఏకశిలా అడ్వాన్స్ లెర్నింగ్ స్కూల్ సీబీఎస్సీ నిర్వహించిన క్లస్టర్ పోటీలలో స్థానిక లాం లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు వివిధ విభాగాల్లో సత్తాచాటారని డైరెక్టర్ చుక్కపల్లి రాజేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14 విభాగంలో భవన్ బాబు (షాట్ పుట్)రజత పతకం, అండర్ 14 బాలికల విభాగంలో రిలే విభా గంలో శర్మిష్ట, దేదీప్య, ఆహానా, లావణ్య, జాహ్నవి కాంస్య పతకాలు సాధించారనని తెలిపారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులు అక్టోబర్ 6, 7, 8 తేదీలలో ఉత్తరప్రదేశ్ లోని వారణాసి వేదికగా జరిగే జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటారని ప్రిన్సిపల్ ఉషారాణి తెలిపారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్ చుక్కపల్లి రమేష్ డైరెక్టర్ చుక్కపల్లి ప్రియాంక తదితరులు అభినందించారు.



ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ వికాస్ సభ్యులు

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

గుంటూరు, సెప్టెంబరు 22: నేటి ఉపాధ్యాయులు నవభారత నిర్మాతలు అని రోటరీ డిస్ట్రిక్ట్(3150) పూర్వ గవర్నర్ పీ.శివన్నారాయణ అభివర్ణించారు. రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు వికాస్ అధ్యక్షుడు పరిశ ఆదిశేష ఆధ్వర్యంలో ఎంపిక చేసిన ఉత్తమ ఉపాధ్యాయులకు 'నేషన్ బిల్డర్' అవార్డుల ప్రదానం కార్యక్రమం స్థానిక టీజేపీఎస్ కళాశాలలో ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథి డిస్ట్రిక్ట్ పూర్వ గవర్నర్ శివన్నారాయణ మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయులు తమ విద్యార్థులను మంచి ప్రయోజనకారు లుగా తీర్చిదిద్ది వారికి బంగారు భవిష్యత్తును కల్పించడమే కాకుండా, దేశ ప్రగతికి కూడా దోహదపడుతున్నారని కొనియాడారు. క్లబ్ అధ్యక్షుడు పరిశె ఆదిశేష మాట్లా డుతూ ప్రతి సంవత్సరం, భావి భారత పౌరులైన విద్యార్థులను తీర్చి దిద్దుతున్న, కొంతమంది మంచి ఉపాధ్యాయులను ఎంపిక చేసి, వారికి "నేషన్ బిల్డర్" అవార్డులు ప్రదానం చేసి సత్కరిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం ఆరుగురు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలైన అద్దేపల్లి నాగలక్ష్మి (జిల్లా పరిషత్ స్కూల్, కారుచోల), బి శైలజా రాణి(ఎస్.కే.బి.హెచ్.స్కూల్, గణపవరం) అబ్దుల్ షాజీర్ (ఉర్దూ అప్పర్ ప్రైమరీ స్కూల్, నులకపేట) పీ.రమాదేవి (ప్రైమరీ స్కూల్, బండారుపల్లి) ఎమ్‌వీఆర్ ఎల్ పీ.శారద (ప్రైమరీ స్కూల్, సురవరపు పల్లి) బొడ్డపాటి విజయలక్ష్మి(జిల్లా పరిషత్ స్కూల్, శావల్యాపురం)లను సత్కరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో రోటరీ జిల్లా డిప్యూటీ గవర్నర్ పీ.శివరంజని, అసిస్టెంట్ గవర్నర్ కొల్లా శ్రీనివాసరావు, క్లబ్ లిట రసీ డైరెక్టర్ బోయపాటి చెన్నయ్య, మలిశెట్టి అప్పారావు పాల్గొన్నారు.

శాస్త్రీయ గాత్ర సంగీత పోటీలు ప్రారంభం



గానం చేస్తున్న చిన్నారి

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 22: స్థానిక లక్ష్మీపురం శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో కర్నాటక గాత్ర సంగీత పోటీలు ఆదివారం ప్రారంభ మయ్యాయి. ఈ పోటీలలో సబ్ జూని యర్స్, జూనియర్స్, సీనియర్స్ పాల్గొని ఉత్సా హంగా గానం చేసి తమ ప్రతి భను చాటారు. కార్య దర్శి వల్లూరి కృష్ణ కిషోర్, ఉపాధ్యక్షుడు గిరిజా శం కర్‌లు మాట్లా డుతూ ఈ పోటీలలో విజేతలకు అక్టో బర్‌లో జరిగే వాగ్గేయకార ఉత్సవాలలో బహుమతి ప్రదానం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా సాయి శృతి మ్యూజిక్ అకాడమీ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, శ్రీ భారతీ సంగీత నిలయం అధ్యక్షురాలు భారతీదేవి, సంగీత కళాశాల ఉపాధ్యాయుడు టీ.సురేష్ బాబు వ్యవహరించారు. కార్య క్రమంలో కార్యవర్గ సభ్యుడు సరయు, రాజ్యలక్ష్మి, ఫణితేజ పాల్గొన్నారు.

'గిన్నిస్'లో చిరంజీవికి స్థానం హర్షణీయం

గుంటూరు (మెడికల్) సెప్టెంబరు 22: డాన్సుల విభాగంలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లో స్థానం సాధించిన ఏకైన నటుడు మెగాస్టార్ చిరంజీవి కావడం హర్షణీయమని జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ల హరి తెలిపారు. తన డాన్సులతో పసి పిల్లల నుంచి ముసలి వాళ్ల వరకు అందరినీ అలరించిన నటుడు చిరంజీవి అని ఆయన ప్రశంసించారు. 46 ఏళ్ల కెరీర్‌లో 156 సినిమాల్లో 537 పాటల్లో 24 వేల డాన్సు మూవ్‌మెంట్లు ప్రదర్శించి ప్రపంచ రికార్డు సృష్టించినట్లు వివరించారు. దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న కూడా చిరంజీవిని వరి స్తుందని ఆళ్ల హరి ఆకాంక్షించారు.

ఉత్సాహంగా స్వచ్ఛతాహీ సేవ సైకిల్ ర్యాలీ

● పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతన్న కలెక్టర్

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 22: గుంటూరు నగరంలో స్వచ్ఛతాహీ సేవ సైకిల్ ర్యాలీ ఉత్సాహ పూరిత వాతావరణంలో ఆది వారం ఉదయం జరిగింది. కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్, నగర కమిషనర్ పులి శ్రీనివాసులతో పాటు అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో సైకిల్ ర్యాలీలో పాల్గొ న్నారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్ వద్ద ఈ ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. వివిధ కూడళ్ల మీదుగా తిరిగి పరేడ్ గ్రౌండ్ వరకు సైకిల్ ర్యాలీ జరిగింది. అంతకముందు కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాల



సైకిల్ ర్యాలీలో పాల్గొని సైకిల్ తొక్కుతున్న అధికారులు, నగర పౌరులు



జెండా ఊపి సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, హాజరైన కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎస్పీ సతీష్ కుమార్ తదితరులు

పరిశుభ్రత ప్రజారోగ్య కార్మికులదే కాదని నగరంలోని ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. వ్యర్థాలను రోడ్లు, కాల్వల్లో వేయకుండా ఉం డాలని ప్రజలకు సూచించారు. స్వచ్ఛతను పాటించడాన్ని ప్రజ లందరూ ఉద్యమంగా భావించాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ స్వచ్ఛత సమిష్టి బాధ్యత అని చెప్పారు. కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగంగా మొక్కలు నాటడం, ప్రజారోగ్య కార్మికులకు వైద్య పరీక్షలు, ఇన్సూరెన్స్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో స్వచ్ఛ గుంటూరు సాధనకు ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతో కృషి చేస్తామని తెలిపారు.

కస్టమ్స్, జీఎస్టీ అధికారుల ఆపన్న హస్తం

● వరదబాధితులకు రూ. 12 లక్షల విలువైన వస్తు సామగ్రి పంపిణీ

గుంటూరు, సెప్టెంబరు 22: విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో రెండు రోజులు పాటు నిరంతర సేవలు అందించి, ముంపు నుండి బాధి తులను కాపాడిన కస్టమ్స్, జీఎస్‌టీ అధికారులు, ఇప్పుడు అదే బాధి తులకు అండగా నిలుస్తూ, ఆపన్న హస్తం అందించారు. కేంద్ర కస్టమ్స్, జీఎస్‌టీ గుంటూరు కమిషనర్ సాధు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఆ శాఖ అధికారులు ఆదివారం విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాల్లోని బాధితులకు నాలుగు లారీల సరుకును వస్తువులను, వస్త్రాలను అంద జేశారు. జీఎస్టీ ప్రధాన కార్యాలయం నుంచి రిలీఫ్ కిట్లతో కూడిన నాలుగు వాహనాలకు కమిషనర్ నరసింహారెడ్డి ఆదివారం జెండా ఊపి, ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వరద బాధి తులకు సాయం అందించేందుకు 'బాక్స్ ఆఫ్ కైండ్ నెస్ ' అనే కార్యక్రమం



బాధితులకు కిట్లు పంపిణీ చేస్తున్న జీఎస్‌టీ గుంటూరు కమిషనర్ నరసింహారెడ్డి, ఇతర అధికారులు

ద్వారా ఎనిమిది రోజుల పాటు ఏపీ లోని పలు కస్టమ్స్, జీఎస్టీ శాఖా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సహాయ శిబిరాల ద్వారా ఎన్నో విలువైన వస్తు సామగ్రి, నిత్యావసర సరుకులు, పలు రకాల వస్త్రాలు సేకరించా మన్నారు. ఈ సేవలో బాధితుల కోసం రూ.12 లక్షల విలువైన, 1400 రిలీఫ్ కిట్‌లు రూపొందించినట్లు చెప్పారు. విజయవాడలోని కండ్రిక, వైయస్ఆర్ కాలనీ, వాంబే కాలనీ, రాజీవ్‌నగర్ ప్రాంతాలలోని పేద కుటుంబాలకు అందజేస్తున్నట్లు చెప్పారు. బాధిత కుటుంబాలను తమ సిబ్బంది ద్వారా ముందుగానే గుర్తించి, వారికి టోకెన్లు ఇవ్వడం వల్ల పం పిణీ సజావుగా జరిగిందన్నారు. కార్యక్రమంలో ఐఆర్ ఎస్ అధికారులు కాకర్ల ప్రశాంత్‌కుమార్, బీ.లక్ష్మినారాయణ, బీ.రవికుమార్, ఎం.నాగరాజు, జీ.సీతారామరాజు, జీఎస్టీ సూపరింటెండెంట్లు జీ.శ్రీనివాసరెడ్డి, ఈశ్వర్, సిహెచ్ వేంకటేశ్వరరావు, శ్రీకాంత్, సురేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.



చెక్కును ఎమ్మెల్యే నసీర్‌కు అందజేస్తున్న విద్యార్థులు

వరద బాధితులకు విద్యార్థుల వితరణ

గుంటూరు(విద్య),సెప్టెంబరు 22: స్థానిక సంగడిగుంటలోని అయ్యప్ప రెసిడెన్సి అపార్ట్‌మెంట్‌లోని చిన్నారులు దాతృత్వం చాటుకున్నారు. వరద బాధితుల సహా యార్థం రూ.21,534ను తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ కార్యాలయంలో ఆదివారం అందజేశారు. చిన్నారులు దాచుకున్న పాకెట్ మనీ, కొంత తల్లిదండ్రుల నుండి సేక రించి అందజేశారు. ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ చిన్న వయసులో చిన్నా రులు ఇంతటి దాతృత్వాన్ని చాటుకోవడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగధర్, సుహాస్, శ్రీనిధి, పావని, రితిక, దాశరథి విఘ్నేశ్వర్, నిత్య, దినేష్, ఆర్యవైశ్య నాయకులు కొనకళ్ళ సత్యం, కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవ స్థానం ఉత్సవ కమిటీ కన్వీనర్ కోటా శేషగిరి,చలమయ్య కాలేజీ ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

యోగతో శారీరక దృఢత్వం: ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు యోగా చేయడం వలన మానసిక ఆరోగ్యంతో పాటు శారీరక దృఢత్వం కూడా మెరుగు పడుతుందని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. ఇటీవల విశాఖ పట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పాల్గొని విజేతలుగా గెలుపొందిన పలువురికి ఆదివారం ఆయన బహుమతులు అందజేశారు. ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు విశాఖ పట్నం జిల్లా భీమిలిలో రాష్ట్ర స్థాయి యోగ పోటీలు జరిగాయి. 10-12 ఏళ్ల బాలికల విభాగంలో షేక్ ఫౌజాహ్, ఇర్ఫాత్ రెండో స్థానంలో, 16-18 ఏళ్ల బాలికల విభాగంలో రావెలకు చెందిన పీవీ త్రివేణి మూడో స్థానం సాధించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అంద జేశారు. కార్యక్రమంలో యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ యోగ వెంకట్, అసిస్టెంట్ రాకేష్ పాల్గొన్నారు.



విజయ్‌కుమార్‌ని సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సంక్షేమం, అభివృద్ధి అంటేనే కాంగ్రెస్

● రాహుల్‌గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా శ్రమించాలి
● ఏఐసీసీ కార్యదర్శి ఉషారాణి
● డీసీసీ అధ్యక్షుడుగా విజయ్‌కుమార్ బాధ్యతల స్వీకారం

గుంటూరు, సెప్టెంబరు 22: సంక్షేమం, అభివృద్ధి అంటేనే కాంగ్రెస్ పార్టీ అని ఏఐసీసీ కార్యదర్శి గారా ఉషారాణి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడుగా నియమితులైన చిలకా విజయ్‌కుమార్ స్థానిక రాజీవ్ గాంధీభవన్‌లో ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా జరి గిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ యువనేత రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు అవిశ్రాంతంగా పని చేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలపై ఎప్పటికప్పుడు ఎండ గట్టాలని, సమష్టిగా పనిచేస్తేనే ప్రజాదరణ పెరుగుతుందన్నారు. నూతన జిల్లా అధ్య క్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలతో కలిసి పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. ఇందుకోసం తన శాయశక్తులా కృషి చేస్తా నన్నారు. కార్యక్రమానికి ముందు లాడ్జి సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహానికి నివా ళులర్పించి అక్కడ నుంచి నేరుగా రాజీవ్ గాంధీభవన్ వరకు కాంగ్రెస్ శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. ఈ సంద ర్భంగా విజయ్‌కుమార్‌ను గజమాలతో కార్యకర్తలు సత్క రించారు. సమా వేశంలో మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, ఏపీసీసీ నాయకులు కొరివి వినయ్‌కుమార్, మదన మోహన్‌రెడ్డి, తాడికొండ వెంకటేశ్వర్లు, డాక్టర్ చందు సాంబశివుడు, రాచకొండ జాన్‌బాబు, సయ్యద్ జబీవుల్లా, సుశీల రాజా, ఏ.రత్తయ్య, బీ.సునీల్, బీ.బ్రాహ్మయ్య, షేక్ ఇంతియాజ్, టీ.సందీప్ తదితరులు పాల్గొన్నారు.



జీజీహెచ్ ఆవరణలో స్వచ్ఛతాహీ సేవలో సిబ్బంది

వైద్యంతో పాటు పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

గుంటూరు (మెడికల్) సెప్టెంబరు 22: ప్రభుత్వాస్పత్రి నుంచి రోగి ఆరోగ్యంగా ఇంటికి వెళ్లాలంటే వైద్యంతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా ముఖ్యమని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వై.కిరణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వాస్పత్రిలో సూపరింటెండెంట్ చీపురు పట్టి, గోడలకు రంగులు వేసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ప్రభుత్వాస్పత్రిలో పరిసరాలు పరిశు భ్రంగా ఉంచేందుకు వాలంటీర్లు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. ఆసుపత్రిలో శానిటేషన్ వర్కర్లు కూడా చక్కగా పని చేస్తున్నారని ప్రశంసించారు. అనతరం పెద్ద సంఖ్యలో నర్సులు, పారా మెడికల్ సిబ్బంది స్వచ్ఛతా హి సేవలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సైకియాట్రి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వీ.కిరణ్, అడ్మినిస్ట్రేటర్ బీ.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఎస్ఈగా నాగమల్లేశ్వరరావు



గుంటూరు (కార్పొరేషన్), సెప్టెంబరు 22 : గుంటూరు నగరపాలక సంస్థ సూప రింటెండెంట్ ఇంజనీర్‌గా కొడాలి నాగమల్లేశ్వరరావును నియ మిస్తూ ఆదివారం రాత్రి ఉత్త ర్వులు వెలువడ్డాయి. ప్రస్తుతం నాగమల్లేశ్వరరావు మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇంజనీర్‌గా పని చేస్తు న్నారు. అక్కడి నుంచి అయనను బదిలీ చేస్తూ గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈగా నియమించారు. ఇక్కడ ఉన్న ఎం.శ్యాంసుందర్‌ను బదిలీ చేశారు. నాగమల్లేశ్వరరావు గుంటూరు సీతారామయ్య హైస్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థి కావడం గమనార్హం.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రైతు సంఘ నాయకులు

ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

పెదనందిపాడు, సెప్టెంబరు 22 : రైతు సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కా ర్యదర్శి కొత్త వెంకటశివరావు అన్నారు. స్థానిక తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రంలో రైతు సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోరు తూ ఈ నెల 25న తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపడతామ ని, రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రభుత్వం హామీ ఇచ్చిందని వెంటనే అమలు చేయాలన్నారు. కౌలురైతులకు భూయజమానులతో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నాగులపాడు, పెదనందిపాడులో కరపత్రాలు అందజేసి ప్రచారం నిర్వహించారు.

బిజినెస్

గుంటూరు ● సోమవారం 23 సెప్టెంబరు 2024

ఈ వారం మరో 11 ఐపీఓలు

» 14 కంపెనీల షేర్ల లిస్టింగ్

ముంబై: ఈ వారం కూడా పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) మార్కెట్ సందడిగా ఉండనుంది. దాదాపు రూ.900 కోట్ల సమీకరణ కోసం 11 కంపెనీలు ఐపీఓకు వస్తున్నాయి. ఇందులో మన్‌బా ఫైనాన్స్, కేఆర్ఎన్ హీట్ ఎక్స్ఛేంజర్ అండ్ రిఫ్రిజిరేషన్ అనే రెండు కంపెనీల ఐపీఓలు మాత్రమే మెయిన్‌బోర్డు కంపెనీల ఐపీఓలు. మిగతా తొమ్మిది ఎస్ఎంఈ కంపెనీలు. వీటికి తోడు ఈ వారం 14 కంపెనీల ఐపీఓల షేర్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో లిస్ట్ కానున్నాయి.

లీలా ప్యాలెస్ నుంచి రూ.5,000 కోట్ల ఐపీఓ

మరోవైపు లీలా ప్యాలెసెస్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ మాతృసంస్థ స్కోలస్ బెంగళూరు లిమిటెడ్ కూడా రూ.5,000 కోట్ల ఐపీఓకు సిద్ధమవుతోంది. ఇందుకోసం ఆదివారం సెబీకి దరఖాస్తు సమర్పించింది. సెబీ ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయకపోతే దేశ హాస్పిటాలిటీ చరిత్రలో ఇదే అతిపెద్ద ఐపీఓ కానుంది. రూ.5,000 కోట్ల ఐపీఓలో రూ.2,000 కోట్లు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా, మిగతా రూ.3,000 కోట్లు కొత్త ఈక్విటీ షేర్ల జారీ ద్వారా సమీకరిస్తారు.

కాగా సోలార్ ఎనర్జీ సొల్యూషన్స్ అందించే సోలార్91 క్లీన్‌టెక్ అనే ఎస్ఎంఈ కంపెనీ కూడా ఐపీఓకు సిద్ధమైంది. ఐపీఓ ద్వారా రూ.100 కోట్లు సమీకరించేందుకు సెబీకి దరఖాస్తు చేసింది.

పండగల సీజన్‌పై

లగ్జరీ కార్ల కంపెనీల భారీ ఆశలు

ఈ ఏడాది 50,000కు పైగానే విక్రయాలు



న్యూఢిల్లీ: పండగల సీజన్ దగ్గర పడుతోంది. దీంతో కార్ల కంపెనీలు ముఖ్యంగా మెర్సిడెజ్ బెంజ్, బీఎండబ్ల్యూ, ఆడి వంటి లగ్జరీ కార్ల తయారీ కంపెనీలు.. అమ్మకాలపై భారీగా ఆశలు పెట్టుకున్నాయి. ఇందుకోసం ఇప్పటికే మార్కెట్లో ఉన్న పాపులర్ మోడల్స్‌తో పాటు మరిన్ని కొత్త మోడల్స్ మార్కెట్లోకి విడుదల చేస్తున్నాయి. కొన్ని కంపెనీలు ఇప్పటికే కొన్ని లగ్జరీ మోడల్స్‌ను మార్కెట్లోకి విడుదల చేశాయి. మరికొన్ని కంపెనీలు వచ్చే వారం, పది రోజుల్లో మార్కెట్లోకి విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే పండగల సీజన్ ప్రత్యేక ఆఫర్లు మరో ఎత్తు. లగ్జరీ కార్ల కంపెనీలతో పాటు డీలర్లు కూడా తమవైన మరిన్ని ఆఫర్లు జోడిస్తున్నారు. దీంతో ఈ ఫెస్టివల్ సీజన్‌లో దేశంలో లగ్జరీ కార్ల అమ్మకాల వృద్ధి రేటు రెండంకెల్లో ఉంటుందని ఆశిస్తున్నట్టు మెర్సిడెజ్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్ చెప్పారు.

జోరుగా అమ్మకాలు

గత ఏడాది మన దేశంలో 40 లక్షలకు పైగా కార్లు అమ్ముడయ్యాయి. అందులో లగ్జరీ కార్ల అమ్మకాలు రెండు శాతం కూడా లేవు. ఈ ఏడాది మాత్రం ఈ అమ్మకాలు 50,000 నుంచి 51,000 మధ్య ఉండే అవకాశం ఉందని మెర్సిడెజ్ బెంజ్ ఇండియా ఎండీ సంతోష్ అయ్యర్ చెప్పారు. హై ఎండ్ కార్లపై ప్రస్తుతం 28 శాతం జీఎస్టీకి తోడు మరో 20 శాతం సెస్ విధిస్తున్నారు. ఇది చాలదన్నట్టు రాష్ట్ర ప్రభుత్వాలు జీరో నుంచి 20 శాతం వరకు రోడ్ ట్యాక్స్ విధిస్తున్నాయి. ప్రభుత్వాలు ఈ పన్నులను హేతుబద్ధం చేస్తే దేశంలో లగ్జరీ కార్ల అమ్మకాలు మరింత జోరందుకుంటాయని కంపెనీలు చెబుతున్నాయి.

'ఈవీ'ల జోష్

వ్యాపారంలో 'ట్రెండ్ ఈజ్ మై బెస్ట్ ఫ్రెండ్' అంటారు. లగ్జరీ కార్ల కంపెనీలూ ఈ మాటను బాగా వంట పట్టించుకున్నాయి. ఇందులో భాగంగా రెండు ప్రధాన నగరాల మధ్య ప్రయాణించేందుకు వీలుగా హైఎండ్ లగ్జరీ ఈవీలను మార్కెట్లోకి విడుదల చేస్తున్నాయి. మెర్సిడెజ్ బెంజ్ ఇప్పటికే తన మేబాక్ సీరిస్‌లో రెండు హైఎండ్ ఈవీలను విడుదల చేసింది. ఒకసారి చార్జింగ్ చేస్తే తమ ఈవీల్లో 600 నుంచి 800 కిలోమీటర్ల వరకు రీచార్జి అవసరం లేకుండా ప్రయాణించవచ్చని కంపెనీ ఇండియా ఎండీ సంతోష్ అయ్యర్ చెప్పారు. ఈవీలపై కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల పన్ను రాయితీలు కూడా ఇందుకు దోహదం చేస్తున్నాయి. ఇవన్నీ ఈ ఫెస్టివల్ సీజన్‌లో దేశంలో లగ్జరీ కార్ల అమ్మకాలకు బాగా కలిసొస్తుందని ఆశిస్తున్నట్టు ఆడి ఇండియా చీఫ్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ తెలిపారు.

నోకియా, ఎరిక్సన్, సామ్‌సంగ్‌లకు వొడాఫోన్ ఐడియా 30,000 కోట్ల ఆర్డర్



న్యూఢిల్లీ: పీకల్లోతు ఆర్థిక కష్టాల్లో ఉన్న వొడాఫోన్ ఐడియా మరోసారి భారత టెలికాం మార్కెట్లో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రెడీ అవుతోంది. ఇందుకు పెద్దఎత్తున తన 4జీ సేవలను విస్తరించడంతో పాటు 5జీ సేవల ప్రారంభానికీ సిద్ధమవుతోంది. ఇందుకు అవసరమైన నెట్‌వర్క్ యంత్రపరికరాల కొనుగోలు కోసం నోకియా, ఎరిక్సన్, సామ్‌సంగ్ కంపెనీలకు 360 కోట్ల డాలర్ల (సుమారు రూ.30,000 కోట్లు) విలువైన కాంట్రాక్టు ఇచ్చింది. ఈ కంపెనీలు ఈ పరికరాల సరఫరా వచ్చే నెల నుంచే ప్రారంభిస్తాయి. 4జీ, 5జీ టెలికాం సేవల ద్వారా రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్ కంపెనీలతో దీటుగా పోటీపడవచ్చని వొడాఫోన్ ఐడియా భావిస్తోంది.

★ మారుతి సుజుకీ.. వ్యాగన్‌ఆర్ వాల్ట్జ్ లిమిటెడ్ ఎడిషన్‌ను తీసుకువచ్చింది. ఈ లిమిటెడ్ ఎడిషన్‌లో ప్రత్యేకమైన స్టైలింగ్, కొత్త ఫీచర్లను చేర్చింది. ఎల్ఎక్స్ఐ, వీఎక్స్ఐ, జెడ్ఎక్స్ఐ వేరియంట్స్‌లో వ్యాగన్‌ఆర్ వాల్ట్జ్ అందుబాటులో ఉండనుంది. 1లీటర్, 1.2 లీటర్ అడ్వాన్స్‌డ్ కే-సిరీస్ ఇంజన్‌తో అందుబాటులో ఉండనున్న ఈ కారు ధరలు రూ.5.64 లక్షలు- రూ.6.71 లక్షల (ఎక్స్‌షోరూమ్) మధ్యన ఉన్నాయి.

★ ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ రెండు కొత్త క్రెడిట్ కార్డ్స్‌ను తీసుకువచ్చింది. మయూర, అశ్వ పేర్లతో ఈ కార్డులను అందుబాటులోకి తెచ్చింది. భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే విధంగా మయూర కార్డును డిజైన్ చేయగా ఆధునిక జీవనశైలికి అనుగుణంగా అశ్వ కార్డును రూపొందించింది.

★ బజాజ్ ఫిన్‌సర్వ్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ ప్రారంభించిన ఏడాది కాలంలోనే రూ.3,500 కోట్ల ఏయూఎం (ఆస్తుల నిర్వహణ)ను అధిగమించిందని బజాజ్ ఫిన్‌సర్వ్ మ్యూచువల్ ఫండ్ వెల్లడించింది. ఇప్పటికే ఈ ఫండ్ రెగ్యులర్ ప్లాన్ 41.30 శాతం, డైరెక్ట్ ప్లాన్ 43.43 శాతం రిటర్నులు అందించిందని తెలిపింది.

26,100 పైన బుల్లిష్

(సెప్టెంబరు 23-27 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

ట్రేడ్ గైడ్

నిఫ్టీ గత వారం 25,849-25,336 పాయింట్ల మధ్యన కదలాడి 434 పాయింట్ల లాభంతో 25,791 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 26,100 పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

❒ 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25,530, 25,418, 25,238, 25,030 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 26,100 బ్రేక్‌డౌన్ స్థాయి: 25,300
నిరోధ స్థాయిలు: 26,000, 26,100, 26,200 (25,900 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 25,600, 25,500, 25,400 (25,700 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



23వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	555
వరంగల్	527	గోదావరి	550
చిత్తూరు	553	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	116
వరంగల్	120	గుంటూరు	119
కరీంనగర్	120	ఒంగోలు	119
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	113
కర్నూలు	120	నెల్లూరు	113
విశాఖపట్నం	105	అనంతపురం	113
గోదావరి	116		

లాభాల స్వీకరణకు చాన్స్!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం ఆటుపోట్లకు లోనయ్యే అవకాశాలున్నాయి. అంతర్జాతీయ సంకేతాలు, యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్ల కోతతో మార్కెట్లలో ఊపు కనిపిస్తోంది. సూచీలు ఇప్పటికే గరిష్ఠాలకు చేరటంతో ఇన్వెస్టర్లు ఏ క్షణమైనా లాభాల స్వీకరణకు దిగే అవకాశం ఉంది. ఈ వారం నిఫ్టీకి 25,550 వద్ద మద్దతు స్థాయిలుండగా, 25,800 వద్ద నిరోధ స్థాయిలున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మెరుగైన సంకేతాలు రాకుంటే ప్రైస్ యాక్షన్ టైట్‌గా ఉండే అవకాశం ఉంది. బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల్లో బలం పెరుగుతోంది. ఎఫ్ఎంసీజీ, ఐటీ, ఫార్మా రంగాలు బుల్లిష్‌గా ఉన్నాయి.

స్టాక్ రికమండేషన్స్

జేఎస్‌డబ్ల్యూ స్టీల్: జూలై నెలలో జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ షేరులో దిద్దుబాటు మొదలైంది. 15 శాతం వరకు పతనమయ్యాయి. రూ.875 స్థాయిలో మద్దతు తీసుకున్న ఈ షేరు మూడు సార్లు రూ.970 వద్ద నిరోధాన్ని ఎదుర్కొంది. గత శుక్రవారం నాటి సెషన్లో భారీ వాల్యూమ్‌తో ఈ స్థాయిని అధిగమించిన ఈ షేరు 3.50 శాతం లాభంతో రూ.981 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.980/960 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,050/1,100 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.940 స్థాయిని స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.

ఎల్ అండ్ టీ: కొన్ని నెలలుగా సైడ్‌వేస్‌లో చలిస్తున్న ఈ కౌంటర్‌లో ప్రైస్ యాక్షన్ టైట్ అవుతోంది. మరోసారి కీలక నిరోధ స్థాయి రూ.3,860కి చేరువ అవుతోంది. ఒకవేళ దీన్ని అధిగమిస్తే భారీ ర్యాలీకి ఆస్కారం ఉంది. లేదంటే పడినప్పుడు కొనుగోలు చేయటం మంచిది. గత శుక్రవారం ఈ షేరు 2.99 శాతం లాభంతో రూ.3,860 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.3,750/ 3,700 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.3,950 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.3,660 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

డీఎల్ఎఫ్: కొన్ని నెలల అప్‌ట్రెండ్ తర్వాత ఈ షేరులో మొదలైన కన్సాలిడేషన్ ఇంకా కొనసాగుతోంది. ప్రస్తుతం చక్కని బేస్ ఏర్పడుతోంది. ప్రస్తుతం ఈ షేరు కీలక నిరోధ స్థాయి రూ.870 వద్ద కదలాడుతోంది. గత శుక్రవారం 3.33 శాతం లాభంతో రూ.877 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో బ్రేకౌట్ జరిగే అవకాశం ఉంది. మూమెంటమ్ ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.870 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.950/990 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.845 స్థాయిని స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.

ఎస్కార్ట్స్ కుబోటా: జీవితకాల గరిష్ఠాన్ని అందుకున్న ఈ షేర్లలో 16% మేర కరెక్షన్ జరిగింది. సెప్టెంబరులో అక్యుములేషన్ కనిపించింది. గత శుక్రవారం గణనీయమైన వాల్యూమ్‌తో ఈ షేరు ఏకంగా 6.88% లాభంతో రూ.4,079 వద్ద క్రాస్‌లైన్ నిరోధాన్ని దాటింది. చక్కని రిస్క్ రివార్డుతో ఆకర్షణీయంగా కనిపిస్తున్న ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.4,050 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.4,350 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. రూ.3,950 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

మ్యాన్‌కైండ్ ఫార్మా: ఈ షేరులో ఈ ఏడాది ఆరంభంలో మొదలైన కరెక్షన్ ముగిసింది. ప్రస్తుతం ఈ షేరు కీలక నిరోధ స్థాయిని అధిగమించింది. మంచి స్ట్రెంత్‌తో నిలదొక్కుకుంటోంది. గత శుక్రవారం 4.52% లాభంతో రూ.2,355 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.2,525 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.2,600/ 2,750 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. రూ.2,500 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com



నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

టెక్ వ్యూ

26,000 చేరువలో నిఫ్టీ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం తొలి నాలుగు సెషన్లలో మైనర్ కరెక్షన్‌లో ట్రేడయినా శుక్రవారం బలమైన ర్యాలీ సాధించింది. నాలుగు రోజుల కరెక్షన్‌లో కూడా ప్రధాన మద్దతు స్థాయి 25,000 కన్నా పైన నిలకడగా ఉండడం మార్కెట్లో బలానికి సంకేతం. చివరికి వారం మొత్తం మీద 435 పాయింట్ల లాభంతో వారం గరిష్ఠ స్థాయి 25,800 చేరువలో ముగిసింది. గత కొద్ది వారాల్లో నిఫ్టీ ఎలాంటి కరెక్షన్ లేదా కన్సాలిడేషన్ లేకుండా 23,800 స్థాయి నుంచి 2,000 పాయింట్ల మేరకు రికార్డు ర్యాలీని సాధించింది. అయితే మిడ్‌క్యాప్ సూచీ తొలుత బలమైన కరెక్షన్ సాధించి 2,000 పాయింట్లు నష్టపోయినా శుక్రవారం బలమైన బౌన్స్‌బ్యాక్ సాధించి చివరికి 175 పాయింట్ల లాభంతో ముగిసింది. స్మాల్‌క్యాప్ సూచీ మాత్రం 170 పాయింట్ల నష్టంతో ముగిసింది. గత కొద్ది వారాలుగా మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు కరెక్షన్ సాధిస్తూ వస్తున్నాయి. మానసిక అవధి 26,000 వద్ద నిఫ్టీ అప్రమత్త సానుకూల ధోరణిలో ప్రారంభం కావచ్చు. తదుపరి దిశ తీసుకునే ముందు కన్సాలిడేషన్ ఏర్పడవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: పాజిటివ్ ధోరణి ప్రదర్శించినట్టయితే శుక్రవారం నాటి గరిష్ఠ స్థాయి 25,850 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మానసిక అవధి 26,000. ఇక్కడ కన్సాలిడేషన్ లేదా కరెక్షన్ ఉండవచ్చు.

బేరిష్ స్థాయిలు: మైనర్ మద్దతు స్థాయి 25,600 కన్నా దిగజారితే మైనర్ బలహీనతలో పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 25,400. భద్రత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో ప్రవేశిస్తుంది.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారంలో అన్ని సూచీల కన్నా మెరుగ్గా ట్రేడయి 1,850 పాయింట్ల మేరకు లాభపడి 53,800 వద్ద క్లోజయింది. ఈ వారంలో పుల్‌బ్యాక్ రియాక్షన్ ఏర్పడవచ్చు. ప్రధాన నిరోధం 54,000. సానుకూలత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. మద్దతు స్థాయి 53,300 కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది.

పాటర్న్: మధ్యకాలిక నెలవారీ చార్టుల ప్రకారం మార్కెట్ ఓవర్‌బాట్ స్థితిలో ఉన్నట్టు ఆర్ఎస్ఐ సూచీ సంకేతం ఇస్తోంది. గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్తంగా ఉండాలన్న సంకేతం ఇది. మార్కెట్ ప్రస్తుతం 26,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద నిరోధం ఎదుర్కొంటోంది. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకోవాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	25,850 25,930
మద్దతు	25,760 25,700



100 రోజుల్లోనే రాజధాని రైతులకు

బకాయిల చెల్లింపు సంతోషకరం

● సుప్రీం, హైకోర్టుల్లో పెండింగ్ కేసులను ఉపసంహరించాలి
● ల్యాండ్ పూలింగ్‌పై రైతుల అనుమానాలు నివృత్తి చేయాలి
● నిర్మాణం పూర్తైన భవనంలోకి సీఆర్‌డీఏ కార్యాలయం మార్చాలి
● రాష్ట్ర ప్రభుత్వానికి అమరావతి జేఏసీ నాయకుల విజ్ఞప్తి


గుంటూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లోనే రాజధాని అమరావతి రైతులకు బకాయిలు చెల్లించడం సంతోషకరమని అమరావతి ఐక్యకార్యాచరణ సమితి నాయకులు అన్నారు. అమరావతి రైతులు, కౌలు రైతుల బకాయిలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారాయణను కలసిన వెంటనే 90శాతం నిధులు విడుదల చేశారని ఆనందం వ్యక్తంచేశారు. ఆదివారం గుంటూరులో అమరావతి ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో జరిగిన మీడియా సమావేశంలో జేఏసీ అధ్యక్షుడు మాదల శ్రీనివాస్ మాట్లాడారు. న్యాయపరమైన చిక్కుల నుంచి రైతులకు ఉపశమనం కలిగించాలని, అసైన్డ్ భూముల రైతుల సమస్యలపై ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. అమరావతి తాగునీటి, భూగర్భ డ్రైనేజీ నిర్మాణాలపై శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేయాలని విజ్ఞప్తి చేశారు. అమరావతి జీవధార కొండవీటి వాగు పునరుజ్జీవ ప్రాజెక్ట్ నిర్మాణం ద్వారా రాజధాని పరిసర ప్రాంతాలకు తాగు, సాగు నీటి అవసరాలు తీర్చేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టులో అమరావతి రాజధానిపై పెండింగ్‌లో ఉన్న కేసులను ఉపసంహరించుకోవాలని శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. అధికారులు గత ప్రభుత్వ నీడ నుంచి మారాలని, లేకుంటే రాజధాని అభివృద్ధి కుంటుపడుతుందని హితవు పలికారు. ముఖ్యంగా రెవెన్యూ అధికారులు తీరు మార్చుకోవాలన్నారు. మౌలిక సదుపాయాలు, ఇతర అంశాల కల్పనపై నిర్దిష్ట కాలపరిమితి ప్రకటించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. సీఆర్‌డీఏ కోసం అమరావతిలో గత టీడీపీ ప్రభుత్వహయాంలో నిర్మాణం పూర్తిచేసిన భవనం సిద్ధంగాఉందని, దసరా పండగలోగా అందులోకి కార్యాలయాన్ని మార్చాలని కోరారు. ల్యాండ్‌పూలింగ్‌లో భాగంగా రైతులు ప్రభుత్వానికి ఇచ్చిన భూముల్లో ఆక్రమణలు, నిర్మాణాలు తొలగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అమరావతి ఉద్యమంలో సహకరించిన వారికి అమరావతి జేఏసీ ఆధ్వర్యంలో నవంబర్‌లో ప్రత్యేకంగా సన్మానంచేయాలని నిర్ణయించామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న అమరావతి జేఏసీ నాయకులు

గత ప్రభుత్వ అక్రమ కేసులను పరిష్కరించాలి: కళ్లం రాజశేఖరరెడ్డి

ఐక్య కార్యాచరణ సమితి సభ్యుడు కళ్లం రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ అమరావతి ఉద్యమంలో గత వైసీపీ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులపై సీఎం చంద్రబాబు దృష్టిపెట్టి పరిష్కరించాలని కోరారు. ల్యాండ్ పూలింగ్‌పై రైతులకున్న అనుమానాలను నివృత్తి చేసి, మిగతా అవసరమైన భూములు తీసుకోవాలన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అసైన్డ్ భూములపై సిట్ విచారణ పేరుతో కౌలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేశారని, జీవో ఎంఎస్ నంబరు 41పై అసెంబ్లీలో తీర్మానం చేసి రైతులకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. సీఆర్‌డీఏ నిబంధనలకు అనుగుణంగా డైనమిక్ ప్లాట్లు కేటాయింపు చేయాలని, భూములు ఆక్రమించిన వారిపై, అనధికార నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజధాని అభివృద్ధిపై రైతులతో, అమరావతి జేఏసీ సభ్యులతో ముఖ్యమంత్రి ప్రత్యేక సమీక్షలు నిర్వహించి పనులు ప్రారంభించాలని కోరారు. రాజధాని రైతు పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి ధనేకుల రామారావు మాట్లాడుతూ గతంలో భూములు ఇవ్వని రైతులు సైతం ఇప్పుడు ముందుకు వస్తున్నారని, వారి సందేహాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కొంతమంది రైతుల ఖాతాల్లో ప్రభుత్వం వేసిన కౌలు జమ కాలేదన్నారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లో రైతుల సమస్యలున్నాయని, జాయింట్ కలెక్టర్‌తో సమావేశం ఏర్పాటు చేసి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న రఘునాథరెడ్డి

ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలు చెల్లించాలి

● ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి రఘునాథరెడ్డి

గుంటూరు(విద్య),సెప్టెంబరు 22: ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తపేటలోని మల్లయ్యలింగం భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సరెండర్ లీవ్ బిల్లులు 2022 నుంచి ఇప్పటి వరకు క్రెడిట్ కాలేదని, పీఎఫ్ లోన్లు , ఫైనల్ పేమెంట్స్, చాలా కాలం నుంచి బకాయిలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మెడికల్ రీయంబర్స్మెంట్ బిల్లులు చెల్లించడం లేదన్నారు. ఆర్థిక బకాయిల చెల్లింపునకు చర్యలు తీసుకోకపోతే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు డి. పెదబాబు, కార్యదర్శి సుబ్బారెడ్డి, ఎ.ఐ.యస్.టి.యఫ్ ఆర్థిక కార్యదర్శి సి.హెచ్.జోసెఫ్ సుధీర్ బాబు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు యస్. రామచంద్రయ్య, ఉపాధ్యక్షులు కే జోజప్ప , జిల్లా గౌర వాధ్యక్షులు ఏ వి ప్రసాద్ బాబు, రాష్ట్ర కౌన్సిలర్ కె శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు డివి సుబ్బారావు, వై శ్యాంబాబు, కె సద్గుణరావు,యం.డి.సాలార్ బేగ్, మధుబాబు, జి. మిధున్ , హనుమంత ప్రసాద్, మస్తాన్ రావు, ఏడుకొండలు, పి. ప్రసాద్, పి. దిబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సిటీ శాఖ గుంటూరు నోడల్ జేసీగా శ్రీలక్ష్మి

● గుంటూరు-2 జేసీగా గీతా మాధురి
● సిటీ శాఖలో పలువురు అధికారులకు స్థాన చలనం

గుంటూరు, సెప్టెంబరు 22: ప్రభుత్వ సాధారణ బదిలీల్లో భాగంగా వాణిజ్యపన్నుల శాఖలోనూ పలువురు అధికారులకు బదిలీ అయ్యారు. గుంటూరు-1 డివిజన్ నోడల్ జాయింట్ కమిషనర్‌గా డి శ్రీలక్ష్మి నియమితులయ్యారు. ప్రస్తుతం ఆమె ఏలూరు డివిజన్ జేసీగా వ్యవహరిస్తున్నారు. అక్కడ నుంచి గుంటూరు నోడల్ జేసీగా బదిలీ అయ్యారు. ఇక గుంటూరు-2 డివిజన్ జాయింట్ కమిషనర్‌గా కుంచనపల్లిలోని ఆ శాఖ చీఫ్ కమిషనర్ కార్యాలయంలో పనిచేస్తోన్న గీతామాధురి నియమితులయ్యారు. ప్రస్తుతం గుంటూరు -1 నోడల్ జేసీగా ఉన్న కేమధుబాబును, గుంటూరు-2 డివిజన్ జేసీగా వ్యవహరిస్తున్న డి నాగజ్యోతిని ఇద్దరిని చీఫ్ కమిషనర్ కార్యాలయానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు-2 డివిజన్ డిప్యూటీ కమిషనర్‌గా వ్యవహరిస్తున్న జి లక్ష్మీ సత్యవేణిని ఆ శాఖ చీఫ్ కమిషనర్ కార్యాలయానికి బదిలీ చేసి ఆమె స్థానంలో అక్కడ విధులు నిర్వహిస్తోన్న డీసీ పిశ్రీనివాసరావును నియమించారు. అలానే పలు సర్కిల్స్‌కు అసిస్టెంట్ కమిషనర్‌లను కూడా బదిలీ చేశారు. బ్రాడీపేట సర్కిల్‌లో ఏసీగా పనిచేస్తున్న స్వామి వివేకానంద తిరుపతిలోని రీజనల్ కార్యాలయానికి బదిలీపై వెళ్ళారు. ఆయన స్థానంలో ఏసీగా మేరువ చందు నియమితులయ్యారు. పట్నంబజార్ సర్కిల్ ఏసీగా పనిచే స్తున్న వెంకటేశ్వరరెడ్డి చీఫ్ కమిషనర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎన్ చందన హర్ష నియమితులయ్యారు. కొత్తపేట సర్కిల్‌లో ఏసీగా పనిచేస్తున్న గద్దే శ్రీనివాసరావు విజయవాడ సూర్యారావు పేట సర్కిల్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రాజమహేంద్రవరం నుంచి కే కేదారేశ్వరరావు నియమితులయ్యారు. గుంటూరు -1 ఇంటెలిజెన్స్ ఏసీగా బీహెచ్ మనోరమ నరసరావుపేటలో ఏసీగా పనిచేస్తూ బదిలీ పై వచ్చారు. వీటితో పాటు డీసీటీవో, జీఎస్టీవోలు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లకు స్థాన చలనం కల్పించారు.

గుంటూరు రూరల్ వార్తలు

మంగళగిరి తాడికొండ ప్రత్తిపాడు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 22: మంగళగిరి బాప్టిస్టుపేటలోని విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో నూతన విద్యుత్‌లైన్ల ఏర్పాటు నిమిత్తం సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు డీఈఈ అక్కల సత్యనారాయణ తెలిపారు. ఆంజనేయ కాలనీ, వీవర్స్ కాలనీ, తెనాలి ఫ్లైఓవర్ ప్రాంతాల్లో ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు ఉండవల్లిలో ప్రజాదర్బార్

తాడేపల్లి, సెప్టెంబరు 22: విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఈ నెల 23వ తేదీన ప్రజాదర్బార్‌లో నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఉండవల్లిలో ఉదయం 6 నుంచి 7 గంటల వరకు వచ్చిన వారికి మాత్రమే ప్రవేశం ఉంటుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఉద్యమకారులను అణచేలా కేంద్ర ప్రభుత్వ తీరు

● సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు



మహాసభలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రామారావు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 22: క్రిమినల్ చట్టాల్లో మార్పులు తీసుకువచ్చి ఉద్యమకా రులను అణిచివేసేలా కేంద్రం ప్రభుత్వం వ్యవహరిస్తుందని సీపీఎం జిల్లా కార్య దర్శి పాశం రామారావు అన్నారు. సీపీఎం శాఖల మహాసభ చార్వాక విద్యాపీఠంలో ఆదివారం జరిగింది. ఈ మహాసభకు జీ నాగేశ్వరరావు, ఎం ప్రసన్నకుమార్ అధ్యక్షత వహించారు. రామారావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక రాజ్యాంగంలో పొందుపరిచిన సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తుందని, ఆయా రాష్ట్రాల హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి మాట్లాడుతూ రాజధాని నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. విలీన గ్రామాల్లో పని చేస్తున్న కార్మికులకు రూ.26 వేల వేతనం చెల్లించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తొలుత సీపీఎం పతాకాన్ని ఆవిష్కరించి, సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పించారు. పలు తీర్మానాలను మహా సభలో ఆమోదించారు. సీపీఎం నిడమర్రు ఒకటో శాఖ కార్యదర్శిగా కట్టెపోగు వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శిగా మంచి కలపూడి రాజముని, రెండో శాఖ కార్యదర్శిగా గైరుబోయిన నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా మంచికలపూడి ప్రసన్నకుమార్‌లను ఎన్నుకున్నారు. సీపీఎం నేతలు ఎం భాగ్యరాజు, వల్లభాపురం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనను జయప్రదం చేయండి

● రైతు సంఘ జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రైతు సంఘ నాయకులు

పెదనందిపాడు, సెప్టెంబరు 22 : రైతు సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు అన్నారు. స్థానిక తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రంలో రైతు సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 25న తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపడతామని, రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రభుత్వం హామీ ఇచ్చిందని వెంటనే అమలు చేయాలన్నారు. కౌలురైతులకు భూయజమానులతో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నాగులపాడు, పెదనందిపాడులో కరపత్రాలు అందజేసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ముద్దన వెంకటేశ్వర్లు, కాపు వెంకటసుబ్బారావు, చుక్కా యానాదులు, దొప్పలపూడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యువతి మృతిపై కేసు నమోదు

పెదనందిపాడు, సెప్టెంబరు 22: యువతి మృతిపై స్థానిక పోలీసు స్టేషన్లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని గోగులమూడికి చెందిన షేక్ సుభానీ, మాధురీలు ద్విచక్ర వాహనంపై శనివారం పెదనందిపాడుకు షాపింగ్‌కు వచ్చి తిరిగి స్వగ్రామం వెళ్తుండగా వరగాని-పొన్నూరు రహదారిలో కట్రపాడు సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి సైడుకాల్వలోకి దూసుకెళ్లింది. దీంతో మాధురి స్పృహ తప్పి కాలువలో పడింది. 108 వాహనంలో ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అందించి గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు తండ్రి సింగంశెట్టి వెంకట్రావు ఫిర్యాదులో తెలిపారు. దీనిపై హెడ్‌కానిస్టేబుల్ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స్కూటీ దగ్ధంపై కేసు దర్యాప్తు

తుళ్లూరు, సెప్టెంబరు 22: రాయపూడిలో ఇంటి ముందు పార్కింగ్ చేసిన స్కూటీని గుర్తు తెలియన వ్యక్తులు ఈ నెల 19న తెల్లవారుజామున దగ్ధం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదివారం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. గ్రామానికి చెందిన పాగోలు సాంబశివరావు ఎప్పుడు మాదిరిగానే లూథరన్ చర్చి దగ్గర గల తన ఇంటి ముందు పార్క్ చేశారు. ఈ నెల 19న రాత్రి ఒంటి గంట సమయంలో మంటలు ఎగసిపడటం కుటుంబసభ్యులు చూశారు. మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. అప్పటికే స్కూటీ పూర్తిగా కాలిపోయింది. సీసీ కెమెరా ఫుటేజీలలో ఒక వ్యక్తి మాస్క్ ధరించి పెట్రోలు పోసి నిప్పు అంటిస్తున్నట్టు అస్పష్టంగా కనబడుతుంది. బాధితుడు సాంబశివరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమరావతి టైలర్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక



అమరావతి టైలర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రతినిధులు

మంగళగిరి, సెప్టెంబరు 22: అమరావతి టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్ నాగుల్‌మీరా, ప్రధాన కార్యదర్శిగా జంజనం వెంకట సాంబశివరావు, కార్యవర్గ సభ్యులుగా భావన్నారాయణ, నల్లమోతు సుబ్రహ్మణ్యం, చాదరాసుపల్లి భాస్కర్, బాపనపల్లి అంజయ్య, అలీ, ఆంజనేయులు, షేక్ అన్వర్‌లను ఎన్నుకున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నాగుల్ మీరా మాట్లాడుతూ మార్కెట్‌లోకి రెడీమేడ్ దుస్తులు రావడంతో దర్జీలకు ఉపాధి గణనీయంగా తగ్గిపోయిందని, వృత్తిపై ఆధారపడిన కుటుంబాలు అనేక ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దర్జీ వృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలని, ఈ విషయమై మంత్రి నారా లోకేశ్‌ను కలిసి సమస్యలు విన్నవిస్తామని తెలిపారు.

వ్యవస్థలను గాడిలో పెడుతున్న ప్రభుత్వం

● పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి రూరల్, సెప్టెంబరు 22: వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయి వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేసిందని, ఎన్డీఏ అధికారం చేపట్టిన నాటి నుంచి వాటిని తిరిగి గాడిలోపెట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించి ప్రజల సంక్షేమానికి పెద్దపీటవేస్తూ ప్రణాళికతో ముందుకు సాగుతుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో మంత్రి నాదెండ్ల మనోహర్ కూటమి వందరోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ఐదేళ్ల పాలన విధ్వంసం తప్ప అభివృద్ధి లేదని ఆరోపించారు. ప్రజల కోసం పనిచేయాల్సిన వ్యవస్థలు స్వార్థపరులైన అప్పటి ప్రజాప్రతినిధుల చేతుల్లో కీలుబొమ్మలుగా మారారని ఆరోపించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎన్నడూ లేని విధంగా గంజాయి, నాసిరకం మద్యం, లా అండ్ ఆడర్ పూర్తిగా అదుపు తప్పి రాష్ట్రం రావణకాష్టంగా మార్చారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు వైసీపీ పాలన ఫలితంగా అదుపుతప్పిన వ్యవస్థలను, రాష్ట్ర పరిస్థితి చక్కదిద్దేందుకు నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు.

మృత్యు పాశాలుగా విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు

● చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు
● చోద్యం చూస్తున్న విద్యుత్ అధికారులు
● వర్షాకాలం కావడంతో ఆందోళనలో రైతులు, ప్రజలు



రావిపాడు పొలాల్లో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, కిందకు వేలాడుతున్న తీగలు



అన్నవరం ప్రాథమిక పాఠశాల సమీపంలో ప్రమాదభరితంగా ట్రాన్స్‌ఫార్మర్

పెదనందిపాడు, సెప్టెంబరు 22: మండలంలోని పలుచోట్ల విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో యమపాశాలుగా వేలాడుతున్నాయి. అసలే వర్షాకాలం ఇంటి ముంగిటే ప్రమాదం మాటువేసుకొని ఉండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పట్టించుకొని ముందస్తుగా ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాల్సిన విద్యుత్‌శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్య వహరిస్తున్నారు. విద్యుత్ తీగలు చెట్టుకొమ్మలకు తగిలి మంటలు ఏర్పడుతున్నాయని, పొలాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ వైర్లు చేతికందే ఎత్తులో వేలాడుతున్నాయి. దీంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల అన్నవరం పొలాల్లో విద్యుదాఘాతంతో గేదెలు మృతి చెందినప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని రైతులు వాపోతున్నారు. అధికారులు ప్రతి నెలరెండో శనివారం నాడు సబ్ స్టేషన్‌లో మరమ్మతులు అని విద్యుత్ సరఫరా నిలిపివేయడమే తప్ప మరమ్మతులు, చర్యలు చేపట్టిన దాఖలాలు లేవన్నారు. అధికారులు విద్యుత్ బకాయిల బిల్లులు కట్టించుకునేటప్పుడు ఉన్న శ్రద్ధ, వినియోగదారుల సమస్యల పరిష్కారంలో చూపడం లేదంటూ బహిరంగంగా విమర్శలు చేస్తున్నారు. అన్నవరం మరి కొన్ని గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మృత్యుపాశాలుగా మారాయి, పాఠశాలలు, ప్రధాన కూడళ్లలో చేతికందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లు ఉండటంతో అటుగా వెళ్లే విద్యార్థులు, పాదచారులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకున్న వారే లేరు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు విద్యుత్ మరమ్మతులు చేపట్టి, ప్రమాదాల నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే వైసీపీ కనుమరుగు కానుంది

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

ఫిరంగిపురం, సెప్టెంబరు 22: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ త్వరలోనే రాష్ట్రంలో కనుమరుగు కానున్నదని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. ఆదివారం ఫిరంగిపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' సభలో ఆయన మాట్లాడుతూ గతంలో వైసీపీ ప్రభుత్వం తీసుకున్న ప్రజావ్యతిరేక విధానాలు, ప్రస్తుతం తీసుకుంటున్న చర్యల కారణంగా ఆ పార్టీకి ప్రజల మద్దతు ఉండదని, దీంతో పార్టీ ఉండే అవకాశం లేదన్నారు. సీఎంగా ఉన్న సమయంలో వైఎస్ జగన్ బటన్‌లు నొక్కి అలసిపోయానని చెప్పారని, ఐతే ప్రజలంతా కలసి ఒక్కసారే బటన్ నొక్కి జగన్‌ను ఇంటికి పంపారన్నారు. పట్టాదారు పాసు పుస్తకంపై జగన్ తన బొమ్మను వేసుకొని రైతుల పొలాలు కాజేయాలని చూశారని, కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేసి జగన్ బొమ్మలను తొలగించి రాజముద్ర ఉండేలా చేశామన్నారు. అలాగే డీఎస్సీ ద్వారా వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన రోజు నుంచే రూ.7వేలు పింఛను ఇచ్చిన ఘనత ఉందన్నారు. రూ.250 చొప్పున వైసీపీ ప్రభుత్వం పింఛన్లను ఐదు సంవ త్సరాలు సాగదీసిందని, అదే కూటమి ప్రభుత్వం ఒకేసారి పింఛన్లు పెంచి ఇచ్చిందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజు జెండా ఎగుర వేయటానికి కూడా పంచాయతీలకు డబ్బులు లేకుండా చేస్తే మేజరు పంచాయతీకి రూ.25వేలు, మైనర్ పంచాయతీలకు రూ.10 వేలు ఇచ్చామన్నారు. విజయవాడకు కృష్ణానది, బుడమేరు, మున్నేరు, కడలేరులు పొంగినా పెద్దగా ప్రాణ నష్టం జరగకుండా సీఎం చంద్రబాబు కాపాడగలిగారన్నారు. పవన్ కల్యాణ్ రూ.6 కోట్లు వితరణ చేసి గ్రామాలను ఆదుకున్నారన్నారు. 2047 కల్లా వికసిత భారత్ లాగే రాష్ట్రంలో స్వర్ణాంధ్రప్రదేశ్ సాధించాలని సీఎం చంద్రబాబు తీవ్రంగా కృషి చేస్తున్నారన్నారు. మూడు సంవత్సరాల్లో రాజధాని నగరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఫిరంగిపురంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజ్ నిర్మిస్తామని, ఇళ్ళు లేని పేదలకు గ్రామీణ ప్రాం తాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు స్థలాలు ఇచ్చి పక్కా ఇళ్లు కట్టిస్తామన్నారు. గత ప్రభుత్వంలో పేరేచర్లలో నిర్మించిన జగనన్న ఇళ్లు పడిపోయే పరిస్థితిలో ఉన్నాయని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కొత్తపల్లి కోటేశ్వరరావు, మండవ నరసింహారావు, బీజేపీ నాయకుడు బ్రహ్మయ్య, జనసేన నేత బేతపూడి విజయశేఖర్, ఎంపీడీవో లక్ష్మీకుమారి, తహసీల్దార్ రాజా రమేష్, ఈవో కొల్లి విష్ణువర్ధనరావు, పసల తోమాస్, పీఆర్ ఏఈ ఎం శ్రీనివాసరావు, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకనుగుణంగా 100 రోజుల పాలన

● టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య



పెదపాలెం ప్రజావేదికలో మాట్లాడుతున్న నందం అబద్దయ్య

దుగ్గిరాల, సెప్టెంబరు 22: రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 100రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా పెదపాలెంలో ప్రజావేదిక కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం నిర్వహించారు. తొలుత 100రోజుల పాలనపై 'ఇది మంచి ప్రభుత్వం' పేరిట కరపత్రాన్ని టీడీపీ నాయకులు అధికారుల చేతుల మీదుగా వేదికపై ఆవిష్కరించారు. అబద్దయ్య మాట్లాడుతూ సామాజిక పింఛన్‌ను రూ.4వేలకు పెంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజల మన్ననలను పొందారన్నారు. మోసపూరితమైన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దుచేసి రైతుల పొలాలను కాపాడటంతో పాటు, ప్రజల ఆస్తులను రక్షణ కల్పించారన్నారు. పేదల ఆకలిని తీర్చేందుకు అన్న క్యాంటీన్‌లను పునఃప్రారంభించారన్నారు. ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్ మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారన్నారు. జనసేన మండల అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి రాగానే గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన గ్రామ పంచాయతీలకు రూ.1452కోట్లు మంజూరు చేశారన్నారు. రాష్ట్రంలో వరదలకు నష్టపోగా ఒక్కో పంచాయతీకి రూ.లక్ష చొప్పున విరాళాన్ని అందించిన ఘనత ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కే దక్కిందన్నారు. బీజేపీ అధ్యక్షుడు పసుపులేటి గణేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అనేక అభివృద్ధి పనులకు వేలకోట్లను కేటాయిస్తూ, కేంద్రం సహకారం అందిస్తోందన్నారు. నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, టీడీపీ నాయకులు గూడూరు వెంకట్రావు, మండల ఉపాధ్యక్షురాలు పసుపులేటి సాయి చైతన్య, ఎంపీటీసీ పుతుంబాక సాయికృష్ణ, మాజీ జడ్పీటీసీ యేళ్ల జయలక్ష్మి, సర్పంచ్ పాటిబండ్ల కృష్ణప్రసాద్, దేవరపల్లి చంటి, వల్లూరు నరసింహారావు, వాసిరెడ్డి శ్రీనివాసరావు, మొవ్వా చంద్రశేఖరరావు, తోట పిచ్చయ్య, యేమినేని కోటేశ్వరరావు, అనిల్, యాకోబు, పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మంగళగిరి పాత కళాబార్ ఆస్తిని వారసుల వద్ద కొనుగోలు చేశాం

● సోనోవిజన్ మేనేజింగ్ డైరెక్టర్ పొట్లూరి భాస్కరమూర్తి

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 22: మంగళగిరిలోని పాత కళాబార్ ఆస్తిని వారసుల వద్ద కొనుగోలు చేశా మని సోనోవిజన్ మేనేజింగ్ డైరెక్టర్ పొట్లూరి భాస్కరమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళగిరి గౌతమబుద్ధ రోడ్డులో 1270 చదరపు గజాల స్థలం ఉందన్నారు. దానిని 2005 నుంచి ఆళ్ల సురేష్‌బాబు కళాబార్ పేరిట వ్యాపారం నడవగా, 2017లో ఆ భవనాన్ని పడగొట్టి షోరూం బిల్డింగ్ నిర్మాణం చేయుటకు ప్లాన్ అప్లై చేశామన్నారు. మంగళగిరి మెయిన్ రోడ్‌లో నలుగురు భాగస్వాములు ఆస్తిని కొని రైస్ మిల్ వ్యాపారం చేశారన్నారు. వారి వారసులు 11మందిలో తల్లం జగన్మోహన్‌రావు ఒకరని అన్నారు. ఈ వారసులంతా కలిసి సురేష్‌బాబుకు ఆస్తి ని అమ్మారని అన్నారు. అప్పట్లోనే అందరూ డబ్బులు తీసుకొని రిజిస్ట్రేషన్ చేశారన్నారు. 13 ఏళ్లపాటు ఈ ఆస్తిపై ఎటువంటి తగాదాలు, కేసులు లేవన్నారు. ఆస్తిని సురేష్‌బాబు అమ్మకానికి పెట్టగా సోనోవిజన్ సంస్థ పార్టనర్ పొట్లూరి శివ సంజీవ జనార్ధనమూర్తి 2017 జూలై 29న కొని డాక్యుమెంట్ నెంబర్ 8121లో 2019 డిసెంబర్ 28న రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని అన్నారు. జనార్ధనమూర్తి అమెరికా వెళ్లే సమయంలో సోనోవిజన్ ఎంటర్‌ప్రైజెస్ లీజు ద్వారా ఇచ్చిన ఆస్తిపై పూర్తిహక్కులు, బాధ్యతలు సోనోవిజన్ ఎంటర్‌ప్రైజెస్ వారికి ఇచ్చారన్నారు. 6 సంవ త్సరాలుగా ఆస్తి మా ఆధీనంలో ఉందని తెలిపారు. 2019 నవంబర్ నెలలో తల్లం జగన్మోహన్‌రావు మరికొంత మంది మధ్యవర్తులతో మా వద్దకు వచ్చి, ఆస్తి మొత్తం తన మేనమామ 1988 డిసెంబర్‌లో తనకు, తన తల్లికి సంక్రమింప చేశాడని, అందువల్ల ఆస్తి పూర్తిగా తనదేనని, తన వద్ద ఆస్తి లింకు డాక్యుమెంటు కూడా ఉందని తెలి పారని చెప్పారు. అందుకని తనకు రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడని అన్నారు. 2004లో అమ్మిన ఆస్తికి మరల 16 సంవత్సరాల తర్వాత డబ్బులు అడగటం ఏమిటి అని ఆశ్చర్యపోయామన్నారు. అయితే జగన్మోహన్‌రావు వీలునామాని పూర్తి సంతకాలతో సృష్టించినట్లు లాయర్ వద్ద నిర్ధారణ అయిందన్నారు. దీంతో వస్తున్న అసత్య ఆరోపణలను నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

డిసెంబరు 14న మాస్టర్ అథ్లెటిక్ మీట్



మాట్లాడుతున్న షేక్ లాల్ వజీర్, పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 22: మాస్టర్ అథ్లెటిక్ మీట్‌ను ఈ ఏడాది డిసెంబరు 14, 15 తేదీల్లో గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ లాల్ వజీర్ తెలిపారు. ఆదివారం ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోటీల్లో గెలిచిన వారు వచ్చే ఏడాది జనవరి 31న కేరళలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శ్రీలక్ష్మీ, మద్దిలేటి రెడ్డి, ప్రభుదాస్, డాక్టర్ సీతారామయ్య, అడపా వెంకటేష్, శివాజీ, గిరిధర్, రమేష్, సుబ్బారావు, కోటేశ్వరరావు, పలు జిల్లాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

రేపు సచ్చిదానంద మూర్తి శత జయంతి

తెనాలి అర్బన్, సెప్టెంబరు 22: తత్వవేత్త సచ్చిదానందమూర్తి శత జయంతి ఈ నెల 24న జరుగుతుందని, సభను జయప్రదం చేయాలని వివేకా ఎడ్యుకేషన్ సొసైటీ డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ పిలుపునిచ్చారు. శత జయంతి కరపత్రాలను ఆదివారం నాజరుపేటలోని స్కూల్లో విడుదల చేశారు. బుర్రిపాలెం రోడ్డులోని వివేకానంద సెంట్రల్ స్కూల్లో నిర్వహించిన సభలో రచయిత విశ్రాంత ఐఏఎస్ అధికారి వాడ్రేవు చినవీరభద్రుడు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తారని చెప్పారు. సచ్చిదానందమూర్తి పేరిట తెనాలి ఇంప్రెషన్స్ ఆధ్వర్యంలో రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తారన్నారు. రైతు కుటుంబంలో జన్మించిన ఆయన రూరల్ మండలం సంగం జాగర్లమూడి గ్రామానికి చెందినవారని, తాత్వికజ్ఞానాన్ని అవపోసనపట్టి తత్త్వశాస్త్రాన్ని సామాన్యులకు అర్థమయ్యే రీతిలో అందించారని చెప్పారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌పోటీలకు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

గుంటూరు(విద్య), సెప్టెంబరు 22: నల్గొండలోని 'ఏకశిలా అడ్వాన్స్ లెర్నింగ్ స్కూల్ సీబీఎస్ఈ' ఈనెల 14 నుంచి 19 వరకు నిర్వహించిన క్లస్టర్ పోటీల్లో స్థానిక లాం లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు వివిధ విభాగాల్లో సత్తాచాటరని డైరెక్టర్ చుక్కపల్లి రాజేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14 విభాగంలో భవన్ బాబు (షాట్‌పుట్) రజత పతకం, అండర్ 14 బాలికల విభాగంలో రిలే విభాగంలో శర్మిష్ఠ, దేదీప్య, ఆహానా, లావణ్య, జాహ్నవి కాంస్య పతకాలు సాధించారనని తెలిపారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులు అక్టోబర్ 6, 7, 8 తేదీల్లో ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి వేదికగా జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ ఉషారాణి గారు తెలియజేశారు. విద్యార్థులను పాఠశాల ఛైర్మన్ చుక్కపల్లి రమేష్ డైరెక్టర్ చుక్కపల్లి ప్రియాంక అభినందించారు.

నేడు బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎన్‌సీసీ సెలక్షన్స్

బాపట్ల రూరల్, సెప్టెంబరు 22 : బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈనెల 23న 22(ఏ) బెటాలియన్ పరిధిలో ఎన్‌సీసీ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.ఆంజనేయులు తెలిపారు. ఆయన కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రభుత్వ ప్రైవేట్ జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో చదువుకునే విద్యార్థులు ఎన్‌సీసీ సెలక్షన్స్‌కు హాజరుకావాలన్నారు.

ప్రజలను నమ్మించి మోసం చేసిన వైసీపీ

● ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వం టీడీపీ
● మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి



డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి

తాడికొండ, సెప్టెంబరు 22: ప్రజలను నమ్మించి మోసం చేసిన ప్రభుత్వం వైసీపీ అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. ఆదివారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. జగన్ ప్రభుత్వంలో నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయన్నారు. విద్యుత్ కోతలు, విద్యుత్ ఛార్జీలు పెంచి జనం నడ్డివిరిచారన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో వంద హామీలను అమలు చేసిందన్నారు. వైసీపీ నాయకులు అధికారంలో ఉన్నప్పుడు ల్యాండ్, సాండ్, మైన్స్, వైన్స్‌లో దోచుకో, పంచుకో, తీసుకో పథకాలు మాత్రమే అమలు చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం అంటేనే స్కామ్ ప్రభుత్వం అనేది సత్యం అన్నారు. ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా వైసీపీ ప్రభుత్వంలో పాలన జరిగిందన్నారు. చంద్రబాబు సీఎం అయిన తరువాత విద్యుత్ కోతలు, విద్యుత్ ఛార్జీలు లేకుండా పాలన చేస్తున్నారని తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వం రాగానే పింఛను రూ.4వేలు ఇస్తున్నారన్నారు. అధికారంలోకి రాగానే ఇస్తానన్న రూ.7వేల పింఛను మాట తప్పకుండా ఇచ్చారన్నారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ఏపీ సీఎం లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 16 వేల టీచర్ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టారన్నారు. 1996 నుంచి ఇప్పటివరకు 9సార్లు మెగా డీఎస్సీ ద్వారా 2,02,179 టీచర్ పోస్టులు భర్తీ చేసిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందన్నారు. పేదలకు అన్నం పెట్టె అన్న క్యాంటీన్లను మూయించి పేదల కడుపుకొట్టారన్నారు. వైసీపీ చేసిన పాపాలకు 11సీట్లతో సర్దుకున్నారన్నారు. బుడమేరు వరద బాధితులకు ఎన్డీ ఏ ప్రభుత్వం అండగా ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉంటే బుడమేరు వరద బాధితులను గాలికి వదిలేవారని దుయ్యబట్టారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు గోదావరి వరదలు వచ్చినప్పుడు మన్యం ప్రాంతంలో మీరు ప్రజలకు ఏ విధంగా అండగా నిలిచారో రాష్ట్ర ప్రజలు చూశారన్నారు. అమరావతి నిర్మాణానికి రూ.15 వేలు కోట్లు, పోలవరంనకు రూ.12 వేల కోట్లు కేంద్రం నిధులు ఏ విధంగా ఇచ్చిందో వైసీపీ నాయకులు చూడాలన్నారు. అమరావతికి పూర్వ వైభవం రాబోతుంది. రాజధాని రైతులకు రూ.400కోట్లు కౌలు ఇచ్చారన్నారు. నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రైతులకు కౌలు వేయకుండా జగన్ తాత్సారం చేశారన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పంచాయతీలను బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నారు. ఒక్కరోజులో 13వేల పైచిలుకు పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి వరల్డ్ రికార్డు నేలకొల్పార న్నారు. సీఎంగా జగన్ ఉన్నప్పుడు ఒక్క ఎమ్మెల్యే కూడా అపాయింట్‌మెంట్ ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజ్ తీసుకువచ్చారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లు, కడప జిల్లా కొంపర్తిలో పారిశ్రామిక క్యారిడార్ తీసుకువచ్చి రూ.25 వేల కోట్లు పెట్టుబడులు పెట్టించి 75వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు. రేషన్ షాపుల్లో సన్న బియ్యం ఇస్తానని చెప్పి ముక్కబియ్యం ఇచ్చారన్నారు. ఆ బియ్యాన్ని దళారులు అమ్ముకొని జేబులు నింపుకున్నారని విమర్శించారు. కందిపప్పును ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. ఉద్దండ్రాయునిపాలెంలో బినామి ద్వారా కరోన సమయంలో లారీ ఇసుక రూ.70 వేలకు అమ్ముకున్నారన్నారు. చెప్పుకుంటుపోతే వైసీపీ ప్రభుత్వంలో అరాచకాలు, అక్రమాలు, అక్రమణలు తప్ప ఏమి జరగలేదన్నారు.

మహాకవి గుర్రం జాషువా జయంతి



కవులు, రచయితలను సన్మానిస్తున్న కొండవీటి రచయితల సంఘం సభ్యులు

ఫిరంగిపురం, సెప్టెంబరు 22: మహాకవిగా గుర్రం జాషువా వెలుగొందారని కవులు, రచయితలు తెలిపారు. ఆదివారం ఫిరంగిపురంలోని దీనాపూర్ ఆవరణలో గల అంబేద్కర్ కళాప్రాంగణంలో గుర్రం జాషువా జయంతి సందర్భంగా కొండవీటి రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో వారు మాట్లాడారు. తెలుగోడి ప్రపంచాన రెపరెప లాడే మానవత్వపు జెండా, దురాచార బంధనాలను వెన్ను విరిచిన అజెండా వినుకొండ గుండె నుంచి పుట్టిన దళిత కొండ, తెలుగుతల్లి మెడలోన వాడిపోని అక్షరాల దండ, గౌరవం కులానికా?, కలానికా? కవిత్వంలో కూడా కుల భేదాలా? అని సమాజాన్ని ప్రశ్నించిన గొప్ప కవి జాషువా అన్నారు. నవయుగ చక్రవర్తి కులరక్కసిని ఎదుర్కొనేందుకు పెన్నును గన్నుగా మార్చిన ఘనుడు అన్నారు. ఆంధ్రావనిని ముగ్ధులను చేసిన కవి జాషువాయేనన్నారు. ఏ కవి స్పృశించని గబ్బిలం, శ్మశానం లాంటి రచనలు విశ్వ విఖ్యాతమయ్యాయన్నారు. సాహిత్యంతో సామాజిక చైతన్యాన్ని నింపిన ఘనుడు జాషువా అన్నారు. కార్యక్రమంలో కవి ఎంఎఫ్ జోసెఫ్ రచించిన మధు విలాసం, షేక్ ఖాజావలి ఖురాన్ గ్రంథాన్ని పద్యరూపంలో రచించిన పుస్తకాలను ఆవిష్కరింప చేశారు. కవులు, రచయితలైన ఎంఎఫ్ జోసెఫ్, షేక్ ఖాజావలి, గుబ్బల దాసు, రాయప్రోలు జగదీష్ శర్మ, విప్పర్ల శౌరీలను బిరుదులిచ్చి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కొండవీటి రచయితల సంఘం అధ్యక్షుడు సయ్యద్ మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

చిలువూరులో 400 మందికి వైద్యపరీక్షలు

దుగ్గిరాల, సెప్టెంబరు 22: చిలువూరు దళితవాడలోని కమ్యూనిటీహాల్లో జరిగిన ఉచిత వైద్యశిబిరంలో 400 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఆర్సీఎం చర్చి ఫాస్టర్ ఏ సురేష్ ఆధ్వర్యంలో, విన్సెంట్ పాల్‌సొసైటీ సహకారంతో జరిగిన శిబిరంలో సీజనల్ జ్వరాలకు సంబంధించి రక్త పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ పావని, డాక్టర్ సింధూర తదితరులు వైద్య పరీక్షలు జరిపారు. శిబిరంలో చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన జబ్బులకు కూడా పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ చిలువూరు మాణిక్యం, ఇందుపల్లి రామారావు, కే జయరాజ్, రవిచంద్ర, మునలయ్య, చంటి, దూరు నాగేష్ పాల్గొన్నారు. అనంతరం పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు.

వరద బాధిత కుటుంబాలకు బియ్యం పంపిణీ

తుళ్లూరు, సెప్టెంబరు 22: వరద బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఆదివారం బియ్యం పంపిణీ చేసింది. తుళ్లూరు తహసీల్దార్ కార్యాలయం నుంచి వరద ప్రాంతాలైన హరిశ్చంద్రపురం, రాయపూడి, లింగాయపాలెం, వెంకటపాలెం తాళ్లాయపాలెం రాయపూడి పెదలంక ఉద్దండ్రాయునిపాలెం లంకకు బియ్యం సరఫరా చేశారు. కూటమి నాయకులు దగ్గరుండి పంపిణీ చేశారు.

ప్రాణాలను కబళిస్తున్న విషజ్వరాలు

● అంతుచిక్కని లక్షణాలతో ప్రజలు విలవిల
● మందులు వాడినా ప్రయోజనం శూన్యం
● పాతమంగళగిరిలో ఐదేళ్ల బాలుడి మృతి
● స్పందించని ప్రభుత్వ యంత్రాంగం

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 22: రెండు నెలల నుంచి మంగళగిరిలో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. ప్రతి ఇంటా జ్వర పీడితులు ఉంటున్నారు. వర్షాకాల సీజనులో జ్వరాలు రావడం సాధారణమే అయినప్పటికీ ప్రస్తుత సీజనులో అంతుచిక్కని విషజ్వరాలు ప్రజల ప్రాణాలను హరిస్తున్నాయి. ఒక్కసారిగా 104, 105 డిగ్రీల జ్వరంతో ఒళ్లు వేడెక్కడం, జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు, వాంతులు వంటి లక్షణాలతో ప్రజలు మంచం పడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులపై ఈ లక్షణాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. జ్వరం ఎంతకీ తగ్గకపోవడంతో బాధితులు ప్రైవేటు ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. ఇటీవల కురి సిన భారీ వర్షాలతో విషజ్వరాల తీవ్రత మరింత పెరిగింది. వర్షాలు కురిసి మూడు వారాలైనప్పటికీ పలు లోతట్టు ప్రాంతాల్లో ఇప్పటికీ నీటి నిల్వలు అలాగే ఉన్నాయి. పారిశుధ్య లోపంతో దోమలు వృద్ధి చెంది అంటువ్యాధులను వ్యాప్తి చేస్తున్నాయి. పారిశుధ్యం మెరుగుదలకు, దోమల నియంత్రణకు క్షేత్రస్థాయిలో అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మలేరియా, వైద్య, ఆరోగ్య శాఖల సిబ్బంది సేవలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఇంట్లో ఒకరికి జ్వరం వస్తే ఒకరి తరువాత ఒకరికి అందరికీ వ్యాప్తి చెందుతుంది. దీంతో యూపీహెచ్‌సీలు, ప్రైవేటు క్లినిక్‌లకు పరుగులు పెడుతున్నారు. అక్కడ మందులు వాడినా ప్రయోజనం లేక విజయవాడ, గుంటూరు నగరాల్లోని కార్పొరేట్ ఆసుపత్రుల్లో చేరుతున్నారు. విపరీతమైన ఒళ్లు నొప్పులు, బ్లడ్ ప్లేట్‌లెట్స్ పడిపోవడం వంటి లక్షణాలతో ఆందోళన చెందుతున్నారు. ఈ లక్షణాలు శరీరంలోని ఇతర అవయవాలపై ప్రభావం చూపి ప్రాణాంతకంగా మారుతున్నాయి. ఇప్పటికే మంగళగిరి పట్టణానికి చెందిన పలువురు విషజ్వరాలతో బాధపడుతూ ప్రాణాలు కోల్పోయారు. తాజాగా పాతమంగళగిరి వరహాలపేటకు చెందిన వూట్ల లోహిత్ ద్వారకా కృష్ణ (5) అనే బాలుడు జ్వరంతో బాధపడుతూ మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళగిరి, విజయవాడలోని ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకువెళ్లినా ప్రయోజనం లేకపోయింది. ప్రాణాలను హరిస్తున్న విషజ్వరాలను నియంత్రించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. వైద్య శిబిరాలను నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మనోహర్

వ్యవస్థలను గాడిలో పెడుతున్న ప్రభుత్వం

● పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి రూరల్, సెప్టెంబరు 22: వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయి వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేసిందని, ఎన్డీఏ అధికారం చేపట్టిన నాటి నుంచి వాటిని తిరిగి గాడిలోపెట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించి ప్రజల సంక్షేమానికి పెద్దపీటవేస్తూ ప్రణాళికతో ముందుకు సాగుతుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో మంత్రి నాదెండ్ల మనోహర్ కూటమి వందరోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ఐదేళ్ల పాలన విధ్వంసం తప్ప అభివృద్ధి లేదని ఆరోపించారు. ప్రజల కోసం పనిచేయాల్సిన వ్యవస్థలు స్వార్థపరులైన అప్పటి ప్రజాప్రతినిధుల చేతుల్లో కీలుబొమ్మలుగా మారారని ఆరోపించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎన్నడూ లేని విధంగా గంజాయి, నాసిరకం మద్యం, లా అండ్ ఆడర్ పూర్తిగా అదుపుతప్పి రాష్ట్రం రావణకాష్టంగా మార్చారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు వైసీపీ పాలన ఫలితంగా అదుపుతప్పిన వ్యవస్థలను, రాష్ట్ర పరిస్థితి చక్కదిద్దేందుకు నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. గంజాయిపై ఉక్కుపాదం మోపామన్నారు. అక్రమ మద్యాన్ని పూర్తిగా నిషేధించి పేదల ప్రాణాలకు భరోసాగా నిలిచామన్నారు. ఐదేళ్లుగా మునిసిపాలిటీ, పంచాయతీలలో పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో చిన్నపాటి వర్షాలకే ఆయా ప్రాంతాలు జలమయమవుతున్నాయని, అందుకే కాలువలో పూడికలు తీయించి సమస్యను పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. అదేవిధంగా పంటకాలువలను సైతం పూడికలు తీయించామని వివరించారు. భారీ వర్షాలకు నష్టం జరిగిన రైతుల్లో అధికశాతం కౌలు రైతులే ఉన్నారని వారందరికీ పూర్తిస్థాయిలో నష్టపరిహారాన్ని నేరుగా వారి ఖాతాల్లోనే జమచేసేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రజలందరికీ మంచి జరిగేలా ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తుందని ఎక్కడా కూడా అవినీతికి తావులేకుండా ప్రజల ప్రభుత్వంగా కూటమి మంచిపేరు తెచ్చుకుంటుందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజల ఆకాంక్షలకు తగ్గట్టుగా పాలన మరింతగా పారదర్శకతతో ముందుకు సాగుతుందని మనోహర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సొసైటీ అధ్యక్షుడు కాంతారావును సన్మానిస్తున్న డైరెక్టర్లు

ఖాతాదారుల అభ్యున్నతికి కాకతీయ సొసైటీ కృషి

● సొసైటీ చైర్మన్ డీఎల్ కాంతారావు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 22: ఖాతాదారుల అభ్యున్నతికి కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ కృషి చేస్తుందని సొసైటీ చైర్మన్ డీఎల్ కాంతారావు చెప్పారు. ఎన్జీవో కల్యాణ మండపంలో ఆదివారం సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాణిజ్య బ్యాంకులకు దీటుగా డిపాజిట్లపై వడ్డీలు ఇవ్వడంతో పాటు తక్కువ వడ్డీలకు రుణాలు సులభ పద్ధతిలో అందిస్తున్నామన్నారు. పట్టణప్రాంత ప్రజల అవసరాలకు అనుగుణంగా రుణాల విషయంలో సొసైటీ ముందుందని చెప్పారు. చెస్ అకాడమీ చాంపియన్‌షిప్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. సొసైటీ సీఈవో కె.ఝాన్సీ నివేదిక సమర్పించారు. ఈ సందర్భంగా సొసైటీ అభివృద్ధికి విశేషకృషి చేస్తున్న చైర్మన్ కాంతారావును డైరెక్టర్లు, ఖాతాదారులు ఘనంగా సన్మానించారు.

అత్తలూరివారిపాలెంలో ఇసుక ట్రాక్టర్ సీజ్

కొల్లిపర, సెప్టెంబరు 22: మండల పరిధిలోని బొమ్మువానిపాలెం, కొల్లిపర, మున్నంగి, వల్లభాపురం, అన్నవరం తదితర గ్రామాల్లో ఇసుకరీచ్‌ల్లో ఎస్‌ఐ కోటేశ్వరరావు తన సిబ్బందితో ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అత్తలూరివారిపాలెం సమీపంలో కృష్ణానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న వీరనారాయణ, రామరాజు

24న పద్మవిభూషణ్ సచ్చిదానంద మూర్తి శత జయంతి

తెనాలి అర్బన్, సెప్టెంబరు 22: తత్త్వవేత్త పద్మవిభూషణ్ సచ్చిదానంద మూర్తి శత జయంతి ఈ నెల 24న జరుగుతుందని, సభను జయప్రదం చేయాలని వివేకా ఎడ్యుకేషన్ సొసైటీ డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ పిలుపునిచ్చారు. శత జయంతి కరపత్రాలను ఆదివారం నాజరుపేటలోని స్కూల్‌లో విడుదల చేశారు. బుర్రిపాలెం రోడ్డులోని వివేకానంద సెంట్రల్ స్కూల్‌లో నిర్వహించిన సభలో రచయిత విశ్రాంత ఐఏఎస్ అధికారి వాడ్రేవు చినవీరభద్రుడు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తారని చెప్పారు. సచ్చిదానందమూర్తి పేరిట తెనాలి ఇంప్రెషన్స్ ఆధ్వర్యంలో రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తారన్నారు. రైతు కుటుంబంలో జన్మించిన ఆయన రూరల్ మండలం సంగం జాగర్లమూడి గ్రామానికి చెందినవారని, తాత్వికజ్ఞానాన్ని అవపోసనపట్టి తత్త్వశాస్త్రాన్ని సామాన్యులకు అర్థమయ్యే రీతిలో అందించారని చెప్పారు. ఆంధ్రా యూనివర్శిటీ ప్రొఫెసర్‌గా, వైస్ చాన్సలర్‌గా, యూజీసీ ఉపాధ్యక్షుడిగా పనిచేసిన ఆయన పలు దేశాల్లో యూనివర్శిటీలకు విజిటింగ్ ప్రొఫెసర్‌గా ఉన్నారని, ఆయన ప్రతిభను గుర్తించిన ప్రభుత్వం పద్మభూషణ్, పద్మవిభూషణ్ గౌరవంతో సత్కరించిందన్నారు.



శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావును సత్కరిస్తున్న ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు

శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావుకు సత్కారం

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 22: పురపాలక సంఘ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావును ఫెంటాస్టిక్ ఫ్రెండ్స్ సర్కిల్ తెనాలి సభ్యులు సత్కరించారు. స్థానిక మారీసుపేటలోని ఏటీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావును గాజుల విజయసారధి ఆధ్వర్యంలో ఫెంటాస్టిక్ ఫ్రెండ్స్ సర్కిల్ తెనాలి సభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెనాలి పురపాలక సంఘంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ రేపల్లె పురపాలక సంఘంకు సాధారణ బదిలీలలో భాగంగా వెళ్తున్న రామచంద్రరావును సత్కరించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రజలకు సేవచేయాలనే తపించే ఉద్యోగులలో రామచంద్రరావు ఒకరన్నారు. ఉద్యోగ ధర్మంతో పాటు సేవా కార్యక్రమాలలో ముందుండి నడిపించే రామచంద్రరావు లాంటి ఉద్యోగులు సమాజానికి అవసరమన్నారు. అనంతరం ఆయనను దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి శ్రీనివాసరావు, గాజుల మోహన్, గోపాళం శ్రీనివాసరావు, శ్రీనివాజ్, తోటకూర చిట్టిబాబు, విష్ణుమొలకల శ్యాంసుందర్, తాడికొండ చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

రూటుమార్చిన రేషన్ మాఫియా



రేషన్ ఎండీయూ వాహనం (ఫైల్ ఫొటో)

● బియ్యం సేకరిస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

● చిన్న వాహనాలపై శివారు మండలాలకు తరలింపు

● ఎమ్మెల్యే కన్నెర్రతో స్థానికంగా నిలిచిన కొనుగోలు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 22: పేదల కడుపు నింపేందుకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యం అక్రమ మార్గంలో అమ్ముకుని కోట్లు కాజేస్తున్న రేషన్ మాఫియా రూటు మార్చింది. గతంలో రాష్ట్రంలో ఎక్కడ రేషన్ బియ్యం పట్టుబడినా పొన్నూరు పేరు ప్రముఖంగా వినపడేది. వైసీపీ ప్రభుత్వ హయాంలో రేషన్ బియ్యం వ్యాపారుల మధ్య తలెత్తిన విభేదాలు ఒక్కరి హత్యకు సైతం దారితీశాయి. రోజు రోజుకు రెచ్చిపోయిన రేషన్ మాఫియా ఆగడాలకు అడ్డేలేకుండాపోయింది. తక్కువ ధరకు బియ్యం కొనుగోలు చేసి లక్షలాది రూపాయల ఆర్జనకు అలవాటు పడ్డ అక్రమార్కుల ఆధిపత్య పోరుతో రేషన్ మాఫియా బెదిరింపులు, దౌర్జన్యాలు, హత్యలకు వెనుకాడలేదని ఆరోపణలు ఉన్నాయి. మాఫియా ఆగడాలతో చౌక బియ్యాన్ని పెద్దఎత్తున నల్ల బజార్‌కు తరలించి వైసీపీ నేతలు మాఫియా నిర్వాహకులు కోట్లు కొల్లగొట్టారు. బియ్యం మాఫియా వ్యవహారం రచ్చకెక్కడంతో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఈ వ్యవహారం ప్రధాన ప్రచార అంశంగా మారింది. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తాను గెలుపొందితే పొన్నూరు నియోజకవర్గంలో రేషన్ మాఫియాకు అడ్డకట్టవేస్తానని బహిరంగ సభల వేదికగా హామీ ఇచ్చారు. అంతేకాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్న పొన్నూరు సభలో రేషన్ వ్యాపారి భర్నబాసు హత్య కేసును సైతం ప్రస్తావించేలా చేశారు. దీంతో పొన్నూరు రేషన్ మాఫియా వ్యవహారం రాష్ట్రమంతా చర్చనీయాంశం అయ్యింది. ఎన్నికలో గెలిచిన అనంతరం ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ రేషన్ మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేసేలా ముందుకు సాగారు. పొన్నూరు చేబ్రోలు మండలాల్లో ఈ రేషన్ బియ్యం వ్యవహారం తీవ్రంగా ఉండటంతో పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించి పొన్నూరు రేషన్ మాఫియాను సమూలంగా నిలిపివేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే రేషన్ మాఫియాపై కన్నెర చేయటంతో పొన్నూరు అర్బన్, రూరల్ పోలీసులు రేషన్ బియ్యం కొనుగోలు చేసే వ్యాపారులను పిలిపించి బియ్యం కొనుగోలు, అమ్మకాలు సాగిస్తే కఠిన చర్యలు తీకుంటామని హెచ్చరించారు. అంతేకాకుండా రాత్రివేళ గస్తీని తీవ్రతరం చేయటంతో రేషన్ మాఫియా ఉక్కిరి బిక్కిరి అవుతుంది. ఇనాళ్లుగా కాసుల వర్షం కురిపించిన రేషన్ బియ్యం ఒక్కసారిగా కొనుగోలు, రవాణా నిల్చిపోవటంతో అక్రమార్కులు ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణ ప్రారంభమైంది.

రూటు మార్చిన రేషన్ ముఠాలు

పొన్నూరు పట్టణంలో నిడుబ్రోలులో ఒకరు, తెలగపాలెంలో ఒకరు, రూరల్ గ్రామంలో ఒకరు ఇలా ముగ్గురు, నలుగురు ఈ రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి పెద్దఎత్తున విక్రయించే వారు. అయితే ఎమ్మెల్యే ఆదేశాలతో అధికారులు వీరి ఆటలు సాగనివ్వకపోవటంతో రేషన్ మాఫియా రూటు మార్చింది. పొన్నూరు నియోజకవర్గానికి సమీపంలోనే బాపట్ల జిల్లా సరిహద్దు ఉండటం మరో వైపు జిల్లాలోనే అనుకుని ఉన్న సమీప నియోజకవర్గ మండలాలకు ఈ రేషన్ మాఫియా వ్యాపారాలు మార్చుకుంటోంది. పొన్నూరులో కొనుగోలు, అమ్మకాలు జరపకుండా పక్క మండలాల్లో పెద్దఎత్తున డంపులు ఏర్పాటు చేసుకుని అక్కడికి బియ్యాన్ని సరఫరా చేయించుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. చిరువ్యాపారుల ద్వారా గ్రామలో పట్టణంలోని వార్డులో సేకరిస్తున్న రేషన్ బియ్యంను టీవీఎస్‌లపై సమీప మండలాలకు చేర్చుకుంటున్నారు. అలాగే ఎవ్వరికి అనుమానం రాని విధంగా ఇంటింటికీ రేషన్ పేరుతో గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన ఎండీయూ వాహనాల ద్వారా బియ్యంను కొనుగోలు చేయించి చిన్న వాహనాల ద్వారా చుండూరు, ఇంటూరు, చందోలు, నిజాంపట్నం, కాకుమాను వంటి మండలాలకు గుట్టుచప్పుడు కాకుండా సరఫరా చేస్తున్నారు. అక్కడి నుంచి రవాణా సాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏది ఏమైనప్పటికి రేషన్ మాఫియాపై పొన్నూరు ప్రజా ప్రతినిధి ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, అధికారులు ఉక్కుపాదం మోపటంతో పొన్నూరులో రేషన్ మాఫియా ఆగడాలకు అడ్డుకట్టపడిందని సర్వత్రా హర్ష వ్యక్తం అవుతోంది.

ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయం



పొన్నూరు 31వ వార్డులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 22: ప్రజల సమస్యలు పరిష్కరించటమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు తోట ప్రసాద్ అన్నారు. పట్టణంలోని 31వ వార్డులో ఆదివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వార్డులో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ కరపత్రాలను పంచిపెట్టారు. అనంతరం జరిగిన సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులలోనే అనేక ప్రజా ఉపయోగ కార్యక్రమాలు అమలు చేసినట్లు చెప్పారు. ప్రధానంగా పెన్షన్ల పెంపు విప్లవాత్మక నిర్ణయం అన్నారు. అలాగే డీఎస్సీ నిర్వహణ ప్రకటన, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు వంటి నిర్ణయాలు ప్రభుత్వం తీసుకుందన్నారు. ఐదేళ్లుగా నిర్వీర్యం చేసిన అమరావతి రాజధానిని తిరిగి ప్రభుత్వం నిర్మాణం ప్రారంభించేలా చేయటం హర్షణీయం అన్నారు. అలాగే పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయటానికి సంకల్పించటం మంచి నిర్ణయంగా తెలిపారు. పాలనపరంగా అనేక మంచి పనులను ప్రభుత్వం చేస్తుందని ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. అలాగే పట్టణంలోని పలు వార్డులో ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసేన, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

తెనాలిలో...

తెనాలి అర్బన్, సెప్టెంబరు 22: అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో కూటమి ప్రభుత్వం మంచి పాలన అందించిందని జనసేన నాయకులు చదలవాడ వేణు చెప్పారు. పట్టణంలోని 7వ వార్డులో ప్రభుత్వం చేసిన మంచి పనులను వివరిస్తూ ఆదివారం కరపత్రాలు పంపిణీ చేశారు. వృద్ధాప్య పెన్షన్ రూ.4 వేలకు పెంచడం, వికలాంగుల పెన్షన్ రూ.6 వేలు చేయడం, ప్రభుత్వ ఉద్యోగులకు 1వ తేదీన జీతాలు అందించడం, వరద బాధితులకు వెన్నంటి ఉండి సాయం చేయడం వంటి ఎన్నో మంచిపనులు కూటమి ప్రభుత్వం అమలు చేసిందన్నారు. దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలు చేస్తుందని చెప్పారు. ఇస్మాయిల్, బాలాజీ, పున్నారావు, వీరయ్య పాల్గొన్నారు.



తెనాలిలో ఇంటింటికి కరపత్రాలు అందజేస్తున్న జనసేన నాయకులు

టెన్నిస్‌లో తెనాలి క్రీడాకారుడి ప్రతిభ



సాధించిన పతకాలతో టెన్నిస్ క్రీడాకారుడు మహేష్

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 22: రాష్ట్రస్థాయి డిపార్టుమెంట్ టెన్నిస్ పోటీలలో టెన్నిస్ క్రీడాకారుడు మహేష్ ప్రతిభ చాటాడు. పట్టణ ది ఆఫీషియల్ క్లబ్ తెనాలి కార్యాలయంలో ఆదివారం నెల్లూరు క్లబ్‌లో జరిగిన టెన్నిస్ పోటీలలో ప్రతిభ చాటిన ఏపీసీపీడీసీఎల్ ఉద్యోగి కొమరవల్లి మహేష్‌ను పట్టణ ది ఆఫీషియల్ క్లబ్ తెనాలి సెక్రటరీ ఈ శేఖర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు క్లబ్‌లో జరిగిన డిపార్ట్‌మెంటు రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలలో టీమ్ ఈవెంట్‌లో వ్యక్తిగత సింగిల్స్, డబుల్స్‌లో విజేతగా నిలిచారని మరిన్ని పోటీలలో పాల్గొని విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పట్టణ సీఐలు మల్లికార్జునరావు, ఎస్ రమేష్‌బాబు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎన్‌సీసీ సెలక్షన్స్

బాపట్ల రూరల్, సెప్టెంబరు 22: బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈనెల 23న 22(ఏ) బెటాలియన్ పరిధిలో ఎన్‌సీసీ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.ఆంజనేయులు తెలిపారు. ఆయన కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో చదువుకునే విద్యార్థులు ఎన్‌సీసీ సెలక్షన్స్‌కు హాజరుకావాలన్నారు.



వరద బాధితులకు నిత్యావసర కిట్‌లను అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు రాంబాబు, వెంకటపూర్ణచంద్, మురళి తదితరులు

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 22: వరద బాధిత కుటుంబాలకు నిత్యావసర కిట్‌లను రోటరీ క్లబ్ సభ్యులు పంపిణీ చేశారు. ఆదివారం తుళ్ళూరు మండలం రాయపూడి పెదలంకలో వరద బాధితులకు రోటరీ క్లబ్ 31500 ఆదేశాలమేరకు రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం, తాడేపల్లి రోటరీ క్లబ్ సభ్యులు నిత్యావసర కిట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీడీజీ అన్నె రత్న ప్రభాకర్ రూ.1.50 లక్షల విలువ చేసే నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జోన్‌వన్ క్లబ్ ఇంటర్ రిలేషన్ చైర్మన్ ఈదర వెంకట పూర్ణచంద్, కన్నెగంటి మురళీకృష్ణ, పావులూరి రాంబాబు, కాకుమాను ఉపేంద్ర దేవయేజనం మురళీకృష్ణ, కాకుమాను ఉపేంద్ర, కొల్లి రాజేంద్రప్రసాద్, తాడేపల్లి క్లబ్ అధ్యక్షుడు రమేష్, ఓబులారెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రగా వెళుతున్న టీడీపీ శ్రేణులు, తెలుగుమహిళలు

తిరుమల పవిత్రతను కాపాడాలంటూ ర్యాలీ

తెనాలిరూరల్, సెప్టెంబరు 22: తిరుమల పవిత్రతను కాపాడాలని స్వామి వారి లడ్డూ ప్రసాదాన్ని కలుషితం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ తెనాలి నియోజవర్గ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో వైకుంఠపురంనకు పాదయాత్ర చేశారు. పట్టణంలోని వీఎస్ఆర్ కళాశాల సమీపంలో ప్రధాన రహదారిపై ఉన్న భారీ వినాయకస్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపిన తెలుగు మహిళలు, టీడీపీ శ్రేణులు అక్కడి నుంచి పాదయాత్రగా వైకుంఠపురం శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవెంకటేశ్వర స్వామివారి దేవస్థానానికి పాదయాత్రగా వెళ్లి స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వామి వారి లడ్డూ ప్రసాదాన్ని జంతువుల కొవ్వుతో అపవిత్రం చేసి కోట్లాదిమంది భక్తుల మనోభావాలు దెబ్బతీసిన అప్పటి వైసీపీ ప్రభుత్వ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో పాటు టీటీడీ పాలకవర్గాన్ని వెంటనే అదుపులోకి తీసుకుని చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తిరుమల పవిత్రతను కూటమి ప్రభుత్వం కాపాడాలని భక్తుల మనోభావాలను దెబ్బ తీసేలా మరొకరు ఇటువంటి దారుణాలకు పాల్పడకుండా గట్టిచర్యలు తీసుకోవాలని వారు కోరారు. పెద్దసంఖ్యలో తెలుగుమహిళలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రఘురామకృష్ణరాజుపై చర్యలు తీసుకోండి

● డీఎస్పీకి ఫిర్యాదు చేసిన జేఏసీ

తెనాలి రూరల్, సెప్టెంబరు 22: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఫ్లెక్సీని తొలగించిన కూటమి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డీఎస్పీ జనార్ధన్‌రావుకు తెనాలి జేఏసీ నాయకులు వినతిపత్రం అందించారు. ప్రజాప్రతినిధిగా బాధ్యతగల పదవిలో ఉండి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఫ్లెక్సీని తొలగించడం ఆయనను అవమానించడమేనన్నారు. మొదటి నుంచి రఘురామకృష్ణరాజు దళితులపై చులకన భావం ఉందని ఇందుకు అంబేద్కర్ ఫ్లెక్సీపై ప్రవర్తించిన తీరే నిదర్శనమన్నారు. కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు స్పందించి రఘురామకృష్ణరాజుపై చర్యలు తీసుకోవాలని కోరారు. అంబేద్కర్‌ను అవమానించిన రఘురామకృష్ణరాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డీఎస్పీని కోరినట్లు తెలియజేశారు. కారుమంచి సునీల్ సందీప్, బొనిగల ప్రదీప్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గడ్డేటి సుందర్‌సునీల్‌కుమార్, గాలి వెంకట్, పిల్లి తిమోతి, బొడ్డు డేవిడ్, అరిగప్రసాద్, దాసు, రాజేష్, సముద్రాల కన్నా, సురేష్, తోటి మనోజ్, వాసు, వేణు తదితరులు పాల్గొన్నారు.

రఘురామకృష్ణరాజు దిష్టిబొమ్మ దహనం

బీఆర్ అంబేద్కర్ ఫ్లెక్సీని చించివేశాడంటూ ఉండి నియోజవర్గ ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు దిష్టిబొమ్మని గాంధీచౌక్‌లో స్థానిక జేఏసీ నాయకులు ఆదివారం దహనం చేశారు. నాయకులు కనపర్తి అనీల్, బొనిగల ప్రదీప్, కారుమంచి సునీల్, జి.సుందర్రావు, ఎ.కిరణ్‌కుమార్, కె.కోటేశ్వరరావు, కె.శ్రీను, బి.బుల్లయ్య, ఎం.సందీప్, జె.సతీష్‌బాబు పాల్గొన్నారు.



బస్ షెల్టర్ వెనుక వైపు పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ రమేష్ బాబు

ప్రజా భాగస్వామ్యంతో స్వచ్ఛ పొన్నూరు

● మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 22: ప్రజా భాగస్వామ్యంతో స్వచ్ఛ పొన్నూరు ఏర్పాటుకు కృషి చేస్తామని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు అన్నారు. ఆదివారం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా పొన్నూరు పట్టణంలోని ముబ్బారక్ నగర్, ఇస్లాంపేట, సాంబశివనగర్, భావనగర్ కాలనీ, ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ తదితర ప్రాంతాలలో కమిషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలు కూడళ్లలో పేరుకున్న చెత్తచెదారాలను తక్షణమే తొలగించాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. అలాగే మురుగు కాల్వలో పేరుకున్న సిల్ట్ సమస్యలను స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సిల్ట్ తొలగింపు కార్యక్రమాలు ప్రారంభించనునట్లు చెప్పారు. సాంబశివనగర్ కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను పరిశీలించి సెంటర్‌లోని వైద్య సదుపాయాలు, మౌలిక వసతుల గురించి ఆరా తీశారు. ప్రతి కార్యాలయం పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే పౌరులు కూడా రోడ్లవెంట చెత్త చెదారాలు వేయకుండా స్వచ్ఛ పొన్నూరు ఏర్పాటుకు సహకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానికులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



పురస్కార సభలో పాల్గొన్న నిర్వాహకులు

సమాజాన్ని చైతన్యపరిచిన మహా కవి జాషువా

● జాషువా సాహిత్య వేదిక అధ్యక్షుడు మొవ్వ శ్రీనివాసరావు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 22: తన రచనల ద్వారా సమాజాన్ని మహా కవి గుర్రం జాషువా చైతన్య పరిచారని జాషువా సాహిత్య వేదిక అధ్యక్షుడు మొవ్వ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని లుంబినీవనంలో దళిత మహా సభ వ్యవస్థాపకుడు డాక్టర్ కత్తి పద్మారావుకు మహాకవి గుర్రం జాషువా పురస్కారం ప్రదానం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ గుర్రం జాషువా రచనలు తెలుగు భాష ఉన్నంత వరకు ప్రజల హృదయాలలో ఉంటాయన్నారు. జాషువా ఆశయ సాధన కోసం పనిచేస్తున్న డాక్టర్ కత్తి పద్మారావుకు జాషువా పురస్కారం అందచేయటం ఆనందంగా ఉందన్నారు. ఖమ్మంకు చెందిన తమ సంస్థ జాషువా రచనల వ్యాప్తికి ఆయన ఆశయ సాధన కోసం నిరంతరం పాటుపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పగిడిపాటి వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, మురళి, స్థానిక సంఘాల నాయకులు కత్తి చేతన్, గద్దం విజయరావు, డాక్టర్ కనపర్తి అబ్రహ్మం లింకన్, మాధవ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలూరమ్మ తల్లి తిరునాళ్లు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 22: మండల పరిధిలోని తాళ్లపాలెం గ్రామంలోని ఆలూరమ్మ తల్లి తిరునాళ్ల ఆదివారం భక్తి శ్రద్ధలతో జరిగింది. అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారికి జలాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. ఆలూరమ్మ తల్లి, పోతురాజుకు ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

స్కూటీ దహనంపై కేసు దర్యాప్తు

తుళ్లూరు, సెప్టెంబరు 22: రాయపూడిలో ఇంటిముందు పార్కింగ్ చేసిన స్కూటీని గుర్తు తెలియన వ్యక్తులు ఈ నెల 19న తెల్లవారుజామున దహనం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదివారం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. గ్రామానికి చెందిన పాగోలు సాంబశివరావు లూథరన్ చర్చి దగ్గర గల తన ఇంటి ముందు పార్క్ చేశారు. ఈ నెల 19న రాత్రి ఒంటి గంట సమయంలో స్కూటీ దహనమైంది. సీసీ కెమెరా ఫుటేజీలలో ఒక వ్యక్తి మాస్క్ ధరించి పెట్రోలుపోసి నిప్పు అంటిస్తున్నట్టు కనబడింది. బాధితుడు సాంబశివరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

జమాతుల్ ఉలుమా ఆధ్వర్యంలో వైద్య శిబిరం

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 22: పొన్నూరు పట్టణంలోని ఇటికంపాడు రోడ్డులో ఆదివారం జమాతుల్ ఉలుమా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. డాక్టర్ ఫిరోజ్‌ఖాన్ ఆద్వర్యంలో వైద్య సేవలు నిర్వహించారు. జ్వరాలు, సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు మందులు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జమాతుల్ నిర్వాహకులు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మానవత స్వచ్ఛంద సంస్థను ప్రారంభిస్తున్న పట్టణ ప్రముఖులు

సాటివారికి సాయపడటమే 'మానవత' లక్ష్యం

● వివేకా విద్యాసంస్థల డైరెక్టర్ ఉప్పల సుకుమార్ బాబు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 22: సాటి వారికి సాయపడటం కోసమే మానవత స్వచ్ఛంద లక్ష్యం అని వివేకా విద్యా సంస్థల డైరెక్టర్ ఉప్పల సుకుమార్ బాబు అన్నారు. డీవీసీ ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో ఆదివారం మానవత స్వచ్ఛంద సంస్థ పొన్నూరు శాఖను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంస్థ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మానవత ద్వారా పర్యావరణ పరిరక్షణ, విద్యార్థులకు నైతిక విలువల బోధన రక్తదానం, వైద్య శిబిరాలు, శాంతి ర్యాలీల నిర్వహణ, చైతన్య కార్యక్రమాలు, ఆత్మీయ సహకారం, నేత్ర, అవయవదానం, సమాజానికి అవసరమైన అన్ని కార్యక్రమాలు నిర్వహించనునట్లు చెప్పారు. త్వరలోనే కార్యవర్గం ఏర్పాటు చేయనునట్లు చెప్పారు. కార్యక్రమంలలో పొన్నూరు పట్టణాభివృద్ధి కమిటీ కన్వీనర్ షేక్ యాసిన్ బాబా, పావులూరి రమేష్, చిమ్మకుర్తి పూర్ణచంద్రరావు, గోగినేని రాధాకృష్ణ, ఎ.సాంబయ్య, యరసాని వెంకటేశ్వర్లు, ఎం.సాంబయ్య, షేక్ లియాఖత్, సత్యనారాయణ, సూరినేని ఆంజనేయులు నాయుడు, ఆకుల సాంబశివరావు, నన్నపనేని రఘునాద్, బోడపాటి రామారావు పాల్గొన్నారు.